వీక్షణం

ఆర్థిక, సామాజిక పక్షపత్రిక

సంపుటి: 1 సంచిక: 8 | సమతా పబ్లికేషన్స్ ప్రచురణ | మార్చి 1-15, 2004

<u>లోపలి పేజీల్లో...</u>

విడి ప్రతి : రూ॥ 6/-
వార్షిక చందా : రూ॥140/-లు

సంపాదకీయం:

ఇవి అవకాశవాద, క్షుద్ర రాజకీయాలు - ప్రజల అప్రమత్తత

ఏడు సంవత్సరాలుగా ఎన్.డి.ఏ. పందిరి కింద అధికార సేద తీరిన కమలాధరులకు ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ తమకు నీడనిచ్చిన భాగస్వామ్య పందిరి గుంజలపై నమ్మకం బొత్తిగా పోయినట్టుంది. అదీగాక వేలకోట్ల రూపాయలను మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేస్తూ ముందస్తు ఎన్నికల దృష్టితో చీకటి భారతావనిని 'వెలుగుల భారతంగా' ప్రజలకు చూపెట్టాలని తాము కొనసాగించిన భ్రమాజనిత ఎండమావుల ప్రచారం రేపటి ఎన్నికల్లో ఓట్ల పంటను పండించదనే విషయం రూఢీ అయిపోయినట్టుంది. ఇక ఎంతమాత్రం ఆలస్యం చేయకూడదని భావించారో ఏమో! పార్టీ 'దార్శనిక పత్రం' పేర నూరు కోట్ల జనాభాకు పైబడిన మతసామరస్య లౌకిక భారతావని పునాదిని పెకలించైనా అధికారాన్ని అందుకోవాలని ఆరాటపడుతున్నారు. అందుకోసం ఒకవైపు తామింతకాలం అవకాశవాదంతో మూతపెట్టిన అతి ప్రమాదకర హిందూత్వ విధానాల ఎజెండా భూతాన్ని బయటకు తీశారు. మరొకవైపు 1982లో తమిళనాడులోని కన్యాకుమారి కొయంబత్తూరు, కర్నాటకలోని హుబ్లీ, ధర్వాడీ, ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తర తెలంగాణా జిల్లాలు, మహారాష్ట్రలోని విదర్భ జిల్లాలో కలిపి మొత్తం 13 రాష్ట్రాల్లో 116 చోట్ల 564 మంది ప్రాణాలను తన రథయాత్ర ద్వారా బలితీసుకున్న మతోన్మాది అద్వాని, 'భారత్‌ఉదయ్' యాత్ర పేరుతో మరోసారి నరహింసాయాత్రకు శ్రీకారం చుట్టాడు.

నిజానికి భాజపా ముందస్తు ఎన్నికలకు కొన్నాళ్ల ముందు నుండే తాను అతికష్టం మీద కడుపులో దాచుకున్న హిందూత్వ సొంత ఎజెండాను అప్పుడప్పుడు బయటకు కక్కుతూనే ఉంది. ఉదాహరణకు అయోధ్యలో రామాలయ నిర్మాణం భాజపా ఎజెండాలో ఎప్పటికీ ఉంటుందని, ప్రస్తుతం పార్టీకి సొంతంగా ప్రభుత్వాన్నేర్పిచే బలం లేదు కాబట్టి సొంతబలం వచ్చేదాకా నిర్మాణం సాధ్యం కాదని, ఎన్‌డిఎ ప్రభుత్వ రథసారథి, భారతీయ జనతా పార్టీ ఏకైక ఆకర్షణ నాయకుడు వాజ్‌పేయి తన జన్మదినం సందర్భంగా ప్రకటించాడు. అయినా లౌకికత్వం ఫోజుకొడుతున్న మిత్రులు ఆ అంశాన్ని అంతగా పట్టించుకోలేదు. పైగా భాజపాకు అంతటి బలసంపత్తులు రావడం అనతికాలంలో అసంభవమనే అవకాశవాదాన్ని వినిపించాయి. కలిసి కాపురం చేస్తున్న తరుణంలో నాడు ఆ విధంగా మతవాద హిందూత్వ ఎజెండాను మాట్లాడ్డంలో భాగస్వామ్య మిత్రులకు ఏ మాత్రం అనౌచిత్యంగా అనిపించలేదు. తీరా ఈ రోజు గోవధ నిషేదం, రామమందిర నిర్మాణం, 370వ అధికరణం రద్దు, ఉమ్మడి పౌరస్మృతి లాంటి అంశాలతో కూడిన మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ ఆదేశిత సంపూర్ణ హిందూత్వ ఎజెండాను ప్రకటించి భాగస్వామ్య పక్షాలను బయటకు చెప్పకోలేని విధంగా పార్టీ 'దార్శనిక పత్రం' పేర భంగపాటుకు గురి చేసింది. హిందూత్వను వదలని భారతీయ జనతా పార్టీకి చెందిన వాజ్‌పేయి సారధ్య ఎన్‌డిఎ ప్రభుత్వానికి తామందిస్తున్న అండదండలు 'పాముకు పాలు పోసి పెంచినట్లే' అవుతుందనే విషయాన్ని ఈ రోజుకూ గ్రహించడం లేదంటే అందుకు కారణం అధికార పీఠం మీద వారికి గల యావ. దానికి తోడు భాజపా భారత్ వెలుగుల ప్రచారం, అద్వాని రథయాత్రలు తమ తమ రాష్ట్రాల్లో అధికారం నిలబెట్టుకోవడం (ఉన్నచోట)లోగాని, అధికారంలోకి రావడానికి (లేనిచోట)గాని తోడ్పడుతుందేమోననే అవకాశవాద రాజకీయ దుర్భలత్వమే కారణం. మొత్తానికి మెజారిటీ ప్రజల్లో మతవాద భావాలు రెచ్చగొట్టడం ద్వారా ఓట్ల పెట్టెలు నింపుకోవడంతో మైనార్టీ ప్రజలు ఊచకోతకు గురైపోయినా ఫరవాలేదు కాని అధికారం చేజిక్కడమే ప్రధానమనుకునే అధికార ఎన్‌డిఎ మిత్రుల ఈ ధోరణి నిర్లజ్యపూరిత క్షుద్ర రాజకీయాల క్రూర పరిహాసానికి నిదర్శనం.

అవకాశవాదంతో కూడిన ఈ ధోరణిని బలహీనతగా పసిగట్టిన భారతీయ జనతా పార్టీ భాగస్వామ్య మిత్రులపై పూర్తి ఆధిపత్యాన్ని చెలాయిస్తుంది. రాష్ట్రంలోని తెదేపా విషయంలో ఇది స్పష్టంగా బయటపడింది. బహుశా దేశంలోనే ఒక మోడల్‌గా నిన్నటిదాకా తెగపొగిడిన 'ఆంధ్రరాష్ట్ర అభివృద్ధి' వాదం, తాము ఊదరగొడుతున్న 'వెలుగుల భారతం' లాంటి అబద్ధాలకోరు ప్రచారమేనన్న సంగతిని ప్రజలు పసిగట్టారని కమలనాధులకు తెలిసిపోయి వుంటుంది. అందుకే ప్రత్యేక రాష్ట్రాన్ని కోరే తెలంగాణ ప్రజల ఆకాంక్షలను వేర్పాటువాదంగా ప్రచారం చేస్తూ, అవకాశవాదంగా ఊదరగొడుతున్న బాబు సమైక్యాంధ్ర నినాదాన్ని కూడా లక్ష్యపెట్టడం లేదు. కాకినాడలో కాకెత్తుకుపోయిన ప్రత్యేక తెలంగాణా నినాదాన్ని అధికారం అందుకోవడాకొక అవకాశవాదంగా కమలనాధులు కేవలం ఎన్నికల ప్రచారానికి వాడుకోజూస్తున్నారు. తమను వట్టి వెర్రివెంగళప్పలుగా భావిస్తున్న ఇలాంటి అవకాశవాద రాజకీయ పార్టీల పట్ల అప్రమత్తంగా ఉండి రేపటి ఎన్నికల్లో ఔచిత్యాన్ని ప్రదర్శించాల్సిన అవసరం పౌరుల మీద ఉంది. ○

1991-2001 మధ్య ఎస్సీల సంక్షేమానికి ప్రభుత్వం కేటాయించిన, ఖర్చు చేసిన నిధులు (రు. కోట్లలో)

సంవత్సరం	కేటాయించింది	ఖర్చు చేసింది	మొత్తం రెవెన్యూ ఖర్చులో ఎస్సీల ఖర్చు శాతం
1990-91	196	181	--
91-92	234	258	4.4
92-93	254	253	3.7
93-94	271	262	3.5
94-95	317	276	3.3
95-96	341	269	2.7
96-97	326	319	2.4
97-98	415	307	2.3
98-99	428	421	2.8
99-2000	425	327	2.5
2000-01	263	229	1.1

పథకాలు	లబ్ధిదారుల సంఖ్య		
	1999-00	**00-01**	**01-02**
భూమి కొనుగోలు	16,000	5,740	6,815
చిన్ననీటిపారుదల	63,200	10,485	7,940
భూమి అభివృద్ధి	25,000	17,090	15,600
స్వయం ఉపాధి	12,000	8,499	7,761

సంవత్సరం	కేటాయింపు	ఖర్చు (కోట్లలో)
1996-97	303	244
1997-98	431	325
1998-99	401	252
199-00	439	252
2000-01	506	371
సంవత్సరం	**కేటాయింపు**	**ఖర్చు**
96-97	171	138
97-98	154	59
98-99	45	67
99-00	39	24
00-01	93	59

సంవత్సరం	మొత్తం కేటాయింపు	ఎస్సీలకు ఖర్చు	మొత్తంలో ఎస్సీల వాటా
1992-93	1997	183	9.15
1993-94	2076	215	10.36
1994-95	2170	217	10.00
1995-96	2720	267	10.00
1996-97	2773	228	8.22
1997-98	3585	214	5.97
1998-99	4679	533	11.38
1999-00	5479	189	3.46
2000-01	8228	-	-

(2002-02 పెర్‌ఫార్మెన్స్ బడ్జెట్ నుండి)

సంవత్సరం	మొత్తం నిధులు	కేంద్ర వాటా	రాష్ట్ర వాటా	విడుదల చేసినవి	దారి మళ్లించబడినవి.
99-00	210	153	67	93	107
00-01	102	87	15	91	11
01-02	163	81	82	-	-

పబ్లిక్ రంగసంస్థల లాభనష్టాలు ప్రైవేటైజేషన్‌కు అక్కరలేదా?

ప్రయివేటు రంగంలో లాభాలు వచ్చే, నష్టాలు వచ్చే పరిశ్రమలున్నట్లే ప్రభుత్వం రంగంలో కూడా లాభనష్టాలుంటాయి. ఇపుడు గాలి తిరిగింది. అనేక ప్రభుత్వరంగ సంస్థలు లాభాలు చూపిస్తుండడం ఒక విషయమైతే, ప్రయివేటు రంగంలో ఉత్పాదక సంస్థలను స్థాపించలేక తలకాయ పట్టుకుంటున్నారు. ట్రాన్స్‌కో సంస్థ ప్రపంచబ్యాంకుతో తెగతెంపులు చేసుకుని, నిధులకోసం తక్కువ వడ్డీకి రుణాలిస్తున్న దేశీయ బ్యాంకులను వినియోగించుకోవాలని నిర్ణయించుకుంది. జెన్‌కోకు రుణాలు ఇవ్వటానికి దేశీయ ద్రవ్యసంస్థలు సన్నద్ధత ప్రకటించాయి. అదే విద్యుదుత్పాదన రంగంలో అయిదు ప్రయివేటు విద్యుదుత్పాదన కేంద్రాల నిర్మాణానికి రుణాలివ్వడానికి సంస్థలు సంశయిస్తున్నాయి. విశాఖ ఉక్కు కర్మాగారం నష్టాల ఊబినుండి బయట పడి లాభాలబాటలో అడుగుపెట్టి సంచలనం సృష్టిస్తోంది. అప్పులు చెల్లించేసింది. అవసరమైతే పబ్లిక్ ఇష్యూ జారీ చేద్దామనే ఆలోచనలో పడింది. ఉత్పాదక శక్తిని పెంచడానికి నిర్ణయించుకొంది. ఇ.సి.ఐ.ఎల్ 02-03లో గత సంవత్సరం కన్నా 48శాతం తక్కువ టర్నోవర్ చేసి రు.150 కోట్ల లాభం సంపాదించింది. ఈ సంస్థ ప్రస్తుత ఎన్నికల కోసం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లను తయారుచేస్తోంది. రామచంద్రాపురంలోని భెల్ సంస్థ ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా లాభాలార్జించింది, 03-04 సంవత్సరం ఆరంభం నాటికి భెల్ చేతుల్లో రు.1870 కోట్ల ఆర్డర్లున్నాయి. విశాఖలోని హిందుస్థాన్ పెట్రోలియం దాని శక్తిసామర్థ్యాలను పెంచుకోవడానికి రు.1635 కోట్ల పథకం తయారైంది. ఉండనా, ఊడనా అంటున్న విశాఖ బి.హెచ్.పి.వి. సంస్థ కూడా నష్టాల ఊబినుంచి బయటపడడానికి సాంప్రదాయేతర ఉత్పత్తుల తయారీకి రంగం సిద్ధం చేసుకుంటోంది. ఒ.ఎన్.జి.సి.,కొత్త గ్యాస్, చమురు నిల్వలను కనుక్కొని, వాటిని ఉత్పత్తి రంగంలోకి మళ్లిస్తుంది. మరి చంద్రబాబో? ఉన్న పరిశ్రమలను పప్పుబెల్లాల్లా అమ్మేస్తున్నారు. అమ్మకపోతే బాబు యజమాని ప్రపంచబాంక్ ఊరుకోదుగా!

– విహారి

వార్తాపత్రికల రిజిస్ట్రేషన్

"వీక్షణం" పత్రిక యాజమాన్యం - ఇతర వివరాల స్టేట్‌మెంట్

ప్రచురణ స్థలం	:	హైదరాబాద్
పత్రిక ప్రచురణ కాలం	:	పక్షపత్రిక
ముద్రాపకుని పేరు	:	వి.హనుమంతరావు
జాతీయత	:	భారతీయుడు
చిరునామా	:	8-3-898/22, నాగార్జున నగర్, హైదరాబాద్ 500073.
ప్రచురణకర్త	:	వి. హనుమంతరావు
జాతీయత	:	భారతీయుడు
చిరునామా	:	పైన తెలిపినదే
యాజమాన్య వివరాలు	:	వి.హనుమంతరావు

వి.హనుమంతరావు అను నేను పైన ప్రకటించిన వివరములన్నీ యదార్థమని పేర్కొనుచున్నాను.

వి. హనుమంతరావు
ప్రచురణకర్త

తెలుగుదేశం ఎన్నికల ప్రణాళిక - అబద్ధాల చిట్టా!

- వి. హనుమంతరావు

గ్రామీణాభివృద్ధికి వచ్చే అయిదు సంవత్సరాలలో 60వేల కోట్లు ఖర్చుచేస్తామని తెలుగుదేశం అధినేత చంద్రబాబు ఎన్నికల తాయిలం చేతిలో పెట్టారు. ఇది కేవలం అంకెల గారడీ అని చెప్పడానికి పెద్దగా కష్టపడాల్సిన పని లేదు. ఆ గణాంకాల్లోకి పోయేముందు గత ఎన్నికల ముందు కూడా ఇలాంటి సర్కస్ ఫీట్ చేశారు. అప్పటికే హైటెక్ రాస్తారోకో పయనం ప్రారంభించిన చంద్రబాబు 1999 ఎన్నికల సందర్భంలో హైటెక్ తాత్కాలికంగా పక్కనపెట్టి వ్యవసాయం పల్లవి అందుకున్నారు. చావుతప్పి కన్ను లొట్టపోయి, బిజెపి సహాయంతో కేవలం మూడు శాతం అధిక ఓట్లు సంపాదించి గట్టెక్కారు. గండం గడిచింది; వ్యవసాయం అనే నిచ్చెనను కాలదన్నారు. హైటెక్ స్పీడ్ జోరు పుంజుకొంది. గత ఎనిమిది సంవత్సరాల్లో నాలుగైదు సంవత్సరాలు ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కొంటే ఆ సమయంలో రైతాంగాన్ని ఆదుకోవడంలో విఫలమయ్యారు. ఇపుడు మళ్లా వ్యవసాయం పల్లవి అందుకున్నారు. రైతులు ఆత్మహత్యలు, కిడ్నీల అమ్మకాలకు పాల్పడుతుంటే, కల్తీ విత్తనాలు, కల్తీ మందుల పాలబడి గత 10 దినాలుగా ధరలు పడిపోయి కునారిల్లిపోతుంటే, పట్టించుకోని చంద్రబాబుకు వ్యవసాయం మళ్లీ గుర్తుకు వచ్చిందంటే అది ఆయన పచ్చి అవకాశవాదాన్నే తెలియచేస్తుంది.

ఇపుడు గ్రామీణాభివృద్ధికి వచ్చే అయిదేళ్ళలో 60వేల కోట్ల రూపాయల ఖర్చుచేస్తానని నమ్మపలుకుతున్నారు. ఒకపక్క బెల్ట్ షాపులు ఏర్పాటుచేసి, పేద రైతుల ఇళ్లు గుల్లచేసే కార్యక్రమం చేపట్టి, రెండోపక్క మీకోసం 60వేల కోట్లు ఖర్చు చేస్తానని రైతుల చెవుల్లో పువ్వులు పెడుతున్నారు. పదవ ప్రణాళికా కాలంలో 46వేల కోట్లు ఖర్చుపెడతానని చెప్పి, వచ్చే అయిదు సంవత్సరాల్లో 60 వేల కోట్లు ఖర్చు చేస్తానంటే నమ్మాలా? 46వేల కోట్లల్లో గ్రామీణాభివృద్ధికి ఖర్చు చేయబోయే ఖర్చు సుమారు 20వేల కోట్లు. అంటే సగటున సంవత్సరానికి నాలుగు వేల కోట్లు. ఈ నాలుగు వేల కోట్లు కూడా ఖర్చు చేయలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. అలాంటి చంద్రబాబు ప్రభుత్వం రాబోయే అయిదు సంవత్సరాల్లో అంతకు మూడురెట్లు, అంటే సగటున 12వేల కోట్లు ఖర్చు చేస్తానంటే నమ్మాలా? ఆయన ఎపుడూ కాలుకింద పెట్టకుండా గాలిలోనే ప్రయాణిస్తుంటారు. కాబట్టి, ఆయన ఆలోచనలు కూడా గాలిలో కబుర్లులాగే ఉంటాయి.

ఇపుడు మనం పదవ ప్రణాళిక రెండో సంవత్సరం చివరలో ఉన్నాం. మొదటి సంవత్సరం గ్రామీణాభివృద్ధి పథకాల కోసం ప్రణాళికలో కేటాయించిన సొమ్మునే ఖర్చు చేయలేదు. వివరాలు చూడండి.

	2002-2003 (రూ. కోట్లలో)	
	బడ్జెట్ అంచనా	సవరించిన అంచనా
వ్యవసాయము	301	179
గ్రామీణాభివృద్ధి	640	530
స్పెషల్ ఏరియా అభివృద్ధి	159	165
నీటిపారుదల	1781	1487
గ్రామీణ విద్యుదీకరణ	78	43
పారిశుధ్యం, నీటిసరఫరా	206	54

అంటే పదవ ప్రణాళిక మొదటి సంవత్సరంలో సవరించిన అంచనాల ప్రకారం గ్రామీణాభివృద్ధికి సుమారుగా ప్రతి నాలుగు రూపాయల్లో ఒక్క రూపాయి ఖర్చు కాలేదు. ఇలా చేసిన కేటాయింపునే ఖర్చు చేయలేని ప్రభుత్వం వచ్చే అయిదేళ్లలో ఇప్పటికన్నా మూడు రెట్లు ఎక్కువ ఖర్చు చేస్తుందా? ప్రణాళిక అంటే అభివృద్ధే. ఆ ప్రణాళిక అమలు ఇలా ఏడ్చింది. ఇక అభివృద్ధి కోసం గత నాలుగేళ్లుగా వర్షాలకోసం రైతులు కళ్లు కాయలు కాసేలా ఆకాశానికి చూసినట్లు, చూస్తూ కూర్చోవాల్సిందే.

వచ్చే అయిదేళ్లలో కేవలం వ్యవసాయానికే 10 వేల కోట్లు ఖర్చు చేస్తానన్నారు. పదవ ప్రణాళికా కాలంలో కేవలం రు.2333 కోట్లు కేటాయించారు. వచ్చే అయిదు సంవత్సరాల్లో మూడేళ్లు పదవ ప్రణాళికలోనివే. ఈ మూడేళ్లలో ఇంకా ఖర్చు చేయాల్సింది రు.1652

కోట్లు. వచ్చే అయిదేళ్లలో ఖర్చు చేస్తానంటున్న పదివేల కోట్లలో, ఈ రు. 1652 కోట్లు తీసివేస్తే, మిగిలిన రు. 8348 కోట్లు 11వ ప్రణాళిక మొదటి రెండేళ్లలో ఖర్చు చేయాల్సి వస్తుందన్నమాట. ఇది సాధ్యమేనా? ఈ కాకుల్లెక్కలు చెప్పి ప్రజల చెవులు తూట్లు వేయజూస్తుంది తెలుగుదేశం.

ఈ ఎన్నికల ప్రణాళికలో గణాంకాలు కూడా ఇచ్చి వాగ్దానాలకు నిర్దిష్ట స్వరూపం ఇచ్చినట్లు ఒకటి రెండు పత్రికలు తెలుగుదేశం నాయకునికి కితాబులిచ్చాయి. ఆ గణాంకాలెంత విశ్వసనీయమైనవో పైన చేసిన విశ్లేషణ తెలియచేస్తుంది.

పేదల కాకుల్లెక్కలు

రాష్ట్ర జనాభా 7.6 కోట్లు. కుటుంబానికి సగటున అయిదుగురు సభ్యులుంటారనుకొంటే ఉన్న కుటుంబాల సంఖ్య ఒకటిన్నర కోట్లు. ఇందులో పేదరికపు రేఖ కిందవున్న 30 లక్షల గ్రామీణ కుటుంబాలను, 10 లక్షల పట్టణ కుటుంబాలను వచ్చే అయిదేళ్లలో ఆ రేఖకు పైకి తీసుకుని రావాలనేది ఎన్నికల ప్రణాళిక వాగ్దానం.

గ్రామాల్లో ఉన్న జనాభా 5.53 కోట్లు లేదా 1.10 కోట్ల కుటుంబాలు. పట్టణాల్లో 55.43 లక్షల జనాభా లేదా 11.08 లక్షల కుటుంబాలున్నాయి. గ్రామాల్లో పేదరికపు రేఖ కింద ఉన్న (11శాతం) 61.10 లక్షలు లేదా 12.22 లక్షల కుటుంబాలు. మరి, 30 లక్షల కుటుంబాలను పేదరికపు రేఖపైన తీసుకుని వస్తానంటారేమిటి? రేఖ పైన వున్నవారిని రేఖ కిందకు పంపేసి, మళ్లా పిలక పట్టుకొని పైకి లాగుతారా ఏమిటి? లేక పక్క రాష్ట్రాలనుంచి తీసుకొని వస్తారా? మొన్న మొన్ననే లేని 80 లక్షల బోగస్ వోటర్లను సృష్టించినట్లే లేని పేదవారిని సృష్టిస్తారా చంద్రబాబూజీ? 'వెలుగు' పథకం కింద 55 శాతం జనం పేదరికపు రేఖ కింద ఉన్నారంటే, లేదు 11 శాతమేనంటారు చంద్రబాబు. గ్రామాల్లో ఉన్న 5.53 కోట్ల జనాభాలో 55 శాతం అంటే 3.04 కోట్లు లేదా 60.82 లక్షల కుటుంబాలు. ఈ 60 లక్షల కుటుంబాల్లో ఎన్నికల ప్రణాళిక ప్రకారం 30 లక్షల కుటుంబాలనే రేఖకు పైకి తీసుకొని వస్తానంటున్నారు కాబట్టి, మిగతా 30 లక్షల కుటుంబాలు పేదరికపు రేఖపైకి రావడానికి మరో అయిదు సంవత్సరాలు ఆగాలన్నమాట. ఈ లెక్కలు చూస్తే రేఖ కింద వున్నవారు 11 శాతం కాదు, 55 శాతం అని 'వెలుగు' సర్వే. నిజమేనన్నమాట.

ఇంకా మీకు చంద్రబాబు ఇచ్చే లెక్కల మీద విశ్వాసం మిగిలి ఉండదనుకొంటా.

నిరుద్యోగం

"ముఖ్యమైన ప్రభుత్వరంగంలో అవసరాన్ని బట్టి ఉద్యోగ నియామకాలు" అనేది మరో ఎన్నికల వరం. ప్రభుత్వ రంగం "ముఖ్యమైన"దెపుడు చంద్రబాబూజీ? ఒక పక్కన ప్రభుత్వరంగాల్ని అయినకాడికి అమ్మేస్తూ, మూసేస్తూ, అందులో ఉద్యోగాలిస్తానంటారేమిటి? అందులోనూ, "అవసరాన్ని బట్టి" ఉద్యోగులను నియమిస్తారట. ఏ సంస్థలోనైనా అవసరమైతేనే ఉద్యోగాలిస్తారు. అయినా "అవసరాన్ని బట్టి" అని ఒక 'క్వాలిఫైయింగ్' అనే మాట చేర్చటంలో మీ భావమేమిటి తిరుమలేశా? (మీరు చిత్తూరు జిల్లా వాసులు కదా!) అందరూ ఉద్యోగాలడుగుతుంటే, ఉపాధి కల్పిస్తానంటున్నారు. సరే. రైల్వే గాంగ్‌మెన్ పోస్టులకు గ్రాడ్యుయేట్లు ఉద్యోగాలకోసం దరఖాస్తులు పెట్టుకోవాల్సి వచ్చిన దురదృష్ట పరిస్థితుల్లో, అలాంటి క్వాలిఫికేషన్లు ఉన్నవాళ్లు కూడా ఉపాధి పథకాలకు తయారయ్యారే అనుకొందాం. అలా అనుకునే ముందు రాష్ట్ర ప్రభుత్వాల ఎకనామిక్ సర్వే (2002-03) చూస్తే జనవరి - నవంబర్ 02 మధ్యకాలంలో రెండున్నర లక్షలమంది ఎక్స్ఛేంజిల్లో పేర్లు నమోదు చేసుకోగా, 13921 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వాటిలో 3923 మందికి మాత్రమే దొరికాయని సమాచారం. అంటే 29 లక్షలమంది నిరుద్యోగుల్లో 3923 మందికి మాత్రమే 02లో ఉద్యోగాలు లభించాయి. ఉపాధి సంగతికొస్తే సంపూర్ణ గ్రామ స్వరోజ్‌గార్ యోజన పథకంకింద 01-02లో 175205 మంది లబ్ధిదారులకు సహాయం చేయాలనుకోగా 79,11 మందికే లాభం చేకూరింది.

ఇవన్నీ చంద్రబాబు నోటవచ్చే అబద్ధాల 'ఆణిముత్యాల్లో' కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఆయన ఇచ్చిన గణాంకాలన్నింటినీ ఇలా లోతుగా అధ్యయనం చేసి విశ్లేషించి మీముందుంచితే, కోపోద్రిక్తులైన మీరు ఏం చేస్తారోనని భయం!!

ఇలా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న చంద్రబాబును మరోసారి గెలిపించాలా? ఏమో అది మీ విజ్ఞతకు వదిలేస్తున్నా.

వ్యవసాయంలో ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులు - ఒక అధ్యయనం

- కె. మాధవరావు

వ్యవసాయరంగంలో ప్రభుత్వ పెట్టుబడులు 1980లో నాటి నుండి క్షీణిస్తున్నాయని అనేక అధ్యయనాలు నిర్ధారిస్తున్నాయి.

ఇటీవల 2001లో వ్యవసాయరంగంలో ప్రభుత్వ పెట్టుబడుల గురించి రమేష్‌చంద్ జరిపిన అధ్యయనం కూడా పెరుగుదలని సూచించినా ఆ తర్వాత ప్రభుత్వ పెట్టుబడులు పెరుగుదల సూచించినా ఆ తర్వాత నాలుగు ఐదేళ్ళపాటు అదే స్థాయిలో స్తంభించిపోయాయని, ఇక ఆ తర్వాత అవి క్షీణిస్తూ వచ్చాయనీ పేర్కొన్నది. రాథ్ (1989), షెట్టి (1990), కుమార్ (1992), రావ్ (1994), అలద్ (1997)ల అధ్యయనాలు కూడా దాదాపు ఇదే రకమైన నిర్ధారణలకు వచ్చాయి. అంతేకాక అధికార వర్గాలు కూడా (జిఒఐ 1994, 1995) ఇదే విషయాన్ని తెలుపుతున్నాయి.

ఈ అధ్యయనాల ప్రకారం, ప్రభుత్వ పెట్టుబడుల క్షీణతకు గల కారణాలను ఈ విధంగా పేర్కొంటున్నాయి. వ్యవసాయానికి కేటాయించిన మొత్తం వనరులలో అత్యధిక భాగం ఎరువులు, నీటిపారుదల, విద్యుత్తు, రుణాలు, వ్యవసాయ ఉపకరణాలు మొదలైన వాటిపై ఇచ్చే సబ్సిడీల కోసమే వ్యయమవుతున్నాయి. ఇటీవల కాలంలో, వ్యవసాయరంగంలో ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడుల పరిపూరకతే వ్యవసాయ ఆర్థికవేత్తలలో చర్చనీయాంశమైంది. వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వ పెట్టుబడుల ప్రాధాన్యత గురించి విశ్లేషిస్తూ రాథ్ (1989) తన అధ్యయనంలో ఈ విధంగా పేర్కొన్నారు: ఈ విషయంలో ప్రభుత్వ ప్రైవేటు పెట్టుబడులు సన్నిహితంగా పెనవేసుకుని ఉన్నాయి. అవి విజయవంతంగా వినియోగపడాలంటే, వాటిని రైతులు పూర్తిగా, సక్రమంగా ఉపయోగించుకోగలగాలి. షెట్టీ (1990) ఈ విధంగా చెబుతున్నారు. వ్యవసాయరంగంలో ప్రభుత్వ రంగ పెట్టుబడులు తరుగుదల అనేది వ్యవసాయరంగం అనాకర్షితం కావడంతో కలిసి ఉంది. ప్రతికూల వాణిజ్య విధానాలు, తలసరి ఆదాయాలలో పెరుగుదల లేకపోవడం మొదలైనవన్నీ వ్యవసాయదారులపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. వారి లాభాంశాలను, సామర్థ్యాన్ని దెబ్బతీయడంతో వారు వ్యవసాయంపై పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడంలేదు. మిశ్రా (1998) తన అధ్యయనంలో జాతీయ గణాంక వివరాల ప్రకారం 1961-62 నుండి 1995-96ల దాకా వ్యవసాయరంగంలో లెక్కల్లోకి వచ్చిన ప్రైవేటు పెట్టుబడులతో చూస్తే- ప్రభుత్వ పెట్టుబడులు ఎంత మాత్రం ప్రధానమైనవిగా లేవని తేల్చి చెప్పారు. గ్రామీణ విద్యుదీకరణ, గ్రామీణ రోడ్లు మొదలైనవాటి కోసం వెచ్చించిన ప్రభుత్వ పెట్టుబడులను, వ్యవసాయరంగ పెట్టుబడులతో కలవనందువల్ల - భారత వ్యవసాయరంగంలో ప్రైవేటు పెట్టుబడులపై ప్రభావం చూపడంలో ప్రభుత్వ పెట్టుబడుల పాత్రపై ఖచ్చితమైన నిర్ధారణలు చేసేవారు ఎవరైనా అప్రమత్తతతో వ్యవహరించాలి. ఈ అంశానికి సంబంధించి దాదాపు అన్ని అధ్యయనాలూ మొత్తం స్థూల సమాచారాన్నే చర్చల్లోకి తీసుకుని వాటి ప్రాంతీయ కోణాలను విస్మరిస్తున్నాయి.

ఈ ప్రస్తుత అధ్యయనంలో వ్యవసాయరంగంలో సూక్ష్మస్థాయిలో పెట్టుబడుల నిర్మాణక్రమాన్ని పరిగణించటం జరిగింది. అందుకు ఖమ్మంజిల్లా భద్రాచలం డివిజన్ దుమ్మగూడెం మండలంలోని రెండు గ్రామాలను ఎంపిక చేసుకున్నాము.

విధానం

అధ్యయన ప్రాంతంలోని నమూనా రైతుల ద్వారా సేకరించిన ప్రాథమిక సమాచారంపై ఈ అధ్యయనం ప్రధానంగా ఆధారపడింది. 47గురు రైతులను నమూనాగా ఎంపిక చేసుకుని వారి నుంచి ప్రాథమిక సమాచారాన్ని సేకరించాము. నమూనా రైతులను ఎంపికచేసే క్రమంలో, రెండు గ్రామాల (దుమ్ముగూడెం, సీతారామపురం) రైతుల జాబితాలోనూ గ్రామ రికార్డుల సహాయంతో సూక్ష్మపరిశీలన గావించాము. ఈ జాబితాలోని కమతాలను ఐదు వర్గాలుగా ప్రత్యేకంగా విభజించాము. ప్రతివర్గం నుండి నమూనా రైతులను ఎంపిక చేశాము. ఈ ఐదు వర్గాలనూ భూకమతాల విస్తీర్ణతను బట్టి విభజించాము. మొదటి వర్గంలో 0 నుండి 2.5 ఎకరాల భూమిగల రైతులు, రెండవ వర్గంలో 2.5 నుండి 5.0 ఎకరాల రైతులు, మూడవ, నాల్గవ, ఐదవ వర్గాలలో వరుసగా 5-10, 10-20, 20 అంతకుపైన ఎకరాల భూకమతాలు గల రైతులున్నారు.

నమూనా గ్రామాల స్వరూపం

దుమ్ముగూడెం గ్రామం భద్రాచలం డివిజన్ కేంద్రానికి 30 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ గ్రామపరిధిలో వ్యవసాయ భూమి 50 శాతం. ఈ గ్రామంలో పేద, చిన్న, మధ్య తరగతి రైతులున్నారు. 25 నుండి 50 ఎకరాల దాకా భూములు ఉన్న రైతులు ఆరుగురు. మరో గ్రామమైన సీతారామపురం రేగుపల్లితో కలిసి భద్రాచలం పర్ణశాలల నుండి 11 కిలోమీటర్ల దూరంలో ఉంది. అలాగే మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ పరిసర ప్రాంతం సాగులో ఉన్న మెట్టభూమి సాగుభూమి 9 శాతం దాకా ఉంటుంది. ఈ గ్రామంలో కూడా పేద, మధ్యతరగతి రైతులే అధికం. ఈ గ్రామంలో 25 ఎకరాలున్న రైతు ఒక్కడే. ఈ గ్రామం భద్రాచలం పట్టణానికి సమీపంలో ఉన్నందువల్ల రవాణా సౌకర్యాలు అధికం. అయినప్పటికీ పట్టణ ప్రాంత ప్రభావం కనిపించదు.

రైతులు స్వయంగా తమ పొదుపు మొత్తాల ద్వారా సమకూర్చిన (స్వంత) పెట్టుబడులు, అదేవిధంగా అప్పుల ద్వారా సేకరించిన పెట్టుబడుల అధ్యయనంలో తేలిందేమంటే 47మంది రైతులలో 12 మంది (25.53 శాతం) స్వంత పెట్టుబడులు సమకూర్చుకోలేక రుణాలు తెచ్చుకున్నారు. 0-2.5 ఎకరాలున్న రైతులు రు.25వేల దాకా స్వంత పెట్టుబడులు సమకూర్చుకోగా, ఒకే రైతు రు.25వేల నుండి 50వేల దాకా పెట్టుబడి పెట్టారు. 2.5-5, 0-10 ఎకరాలున్న రైతుల విషయంలో కూడా కొంచెం ఇంచుమించుగా ఇదే పరిస్థితి ఉన్నది. వీరి పెట్టుబడుల స్థాయి రు.75వేల నుండి లక్షదాకా ఉంటుంది. ఈ స్థాయిలోని ఒకే ఒక రైతు రు.లక్షకు పైగా స్వంతంగా పెట్టుబడి పెట్టారు. మొత్తంమీద చూస్తే, నాలుగవ వంతు రైతులు పొదుపు మొత్తాల ద్వారా స్వంతంగా పెట్టుబడులు సమకూర్చ లేకపోయారు. అధిక సంఖ్యాకులు అంటే 58 శాతం రైతులు రు.25వేల దాకా మాత్రమే పెట్టుబడి సమకూర్చుకోగలిగారు. రైతులు తమ ఆదాయాల నుండి పొదుపు చేసుకోలేకపోవడాన్నే ఈ ధోరణి తెలియజేస్తున్నది.

మొత్తం 47మంది రైతుల్లో 46 (98 శాతం) మంది రైతులు వివిధ సంస్థల ద్వారా వ్యక్తుల ద్వారా అప్పులు సేకరించి వ్యవసాయ పెట్టుబడులుగా వినియోగించారు. దీంతో పొలం విస్తీర్ణానికి, అప్పు మొత్తానికి సంబంధం లేదని తేలిపోతుంది. 42మంది రైతుల్లో 37 (88శాతం) మంది సంస్థలనుండి, వ్యక్తుల నుండి కూడా అప్పులు తెచ్చుకున్నారు. మిగిలిన ఐదుగురు రైతులు- వ్యక్తుల నుండే అప్పులు సమకూర్చుకున్నారు. సంస్థల ద్వారా లభించిన సగటు రుణం రు.17,887 దాకా ఉంటుంది. అది సంస్థేతర రుణాలు అయితే రు.67,886 దాకా ఉంటుంది. దీన్ని బట్టి సంస్థల ద్వారా రుణసదుపాయం తగినంతగా లేకపోవడం వల్ల రైతులు సంస్థేతర మార్గాలపైనే రుణసదుపాయం కోసం ఆధారపడుతున్నట్టు తేలుతోంది.

దాదాపు 80శాతం రైతులు ఎరువులు, పురుగుమందుల దుకాణాలు, కమిషన్ వ్యాపారుల నుండి అప్పులు పొందుతున్నారు. కేవలం 20శాతం (6గురు) రైతులు మాత్రమే ఇతర మార్గాల ద్వారా అంటే మధ్యవర్తులు, వడ్డీవ్యాపారుల నుండి రుణాలు సమకూర్చుకుంటున్నారు. రుణాలు సమకూర్చుకోవడంకంటే రైతులకు ప్రత్యామ్నాయంలేదని తేలుతోంది. అందువల్లే వారు- ఎరువుల, పురుగుమందు దుకాణదారులనుండి కమిషన్ వ్యాపారుల నుండి అప్పులు తెచ్చుకుంటున్నారు. సాధారణంగా రైతులు తమ పెట్టుబడుల్లో 70 శాతాన్ని ఎరువులు, క్రిమిసంహారకాల కొనుగోలుకే వినియోగిస్తున్నారు. సంస్థేతర రుణాలపై వడ్డీరేటు సంవత్సరానికి రు.12.48 దాకా ఉంటోంది. 42మంది రైతుల్లో 50 శాతం మంది రు.12ల దాకా, 45శాతం మంది (36) రు.12.24 దాకా వడ్డీరేటు చెల్లిస్తున్నారు. కేవలం ఇద్దరు రైతులు మాత్రమే 12శాతం వడ్డీకి రుణాలు పొందగలిగారు. అధిక సంఖ్యాకులైన రైతులు తమ వ్యవసాయ పెట్టుబడుల కోసం సంస్థాగత వడ్డీరేట్ల కంటే అధిక వడ్డీరేట్లు చెల్లించవలసి వస్తోంది. నమూనాగా తీసుకున్న రైతులు దాదాపు మొత్తం అందరికీ రు.5 వేల నుండి లక్ష రూపాయల దాకా పాత రుణాలు ఉండటం ఆందోళనకరమైన విషయం. 60శాతం రైతుల పాత అప్పులు రు.10వేల నుండి 20వేల దాకా ఉంటాయి. 19శాతం రైతులకు 20 నుండి 40వేల రూపాయల దాకా పాత అప్పులున్నాయి. మిగిలిన వారికి 40వేల నుండి లక్ష రూపాయలదాకా పాత అప్పులున్నాయి. తమ వ్యవసాయ భూముల విస్తీర్ణంతో సంబంధం లేకుండా అనేకమంది రైతులు తాము తీసుకున్న అప్పుల్లో అత్యధిక భాగం తిరిగి చెల్లించడం ఆసక్తికరమైన విషయం. 52శాతం రైతులు మొత్తం అప్పు మొత్తాల్లో 75శాతం, 24శాతం రైతులు 50-75శాతం, మిగిలినవారు 24శాతం అప్పు మొత్తాలను తిరిగి చెల్లించినట్టుగా గ్రహించాం. రైతులు పాత అప్పుల్లో కూరుకుపోవడానికి కారణం గిట్టుబాటు ధరలు లేకపోవడం, ఫలసాయం తగ్గటంగా చెప్పవచ్చు.

విశ్లేషణ

ఆర్థిక సంస్థల రుణసదుపాయాలు విస్తరించడంతో ప్రమేయం లేకుండా, రైతులు తమ వ్యవసాయ పెట్టుబడుల కోసం ఇతర

మార్గాలపైనే ఆధారపడుతున్నారు. ఆర్థిక సంస్థలు తగినంతగా లేకపోవడం, అలాగే అవి సకాలంలో రుణాలు మంజూరు చేయకపోవడమే అందుకు కారణం. ఈ అధ్యయన ప్రాంతంలోని రైతులు ఇతరుల నుండే అత్యధిక వడ్డీరేట్లకు అప్పులు తీసుకున్నారు. వాటిని చాలా వరకూ వ్యవసాయంలో యాంత్రీకరణ, భూమిని చదునుచేయడం, స్వంత నీటిపారుదల వ్యవస్థను సమకూర్చుకోవడం మొదలైన వాటికి వినియోగిస్తున్నారు. ఈ ఖర్చులన్నీ ప్రైవేటు పెట్టుబడుల ఖాతా క్రిందకే వస్తాయి.

దుమ్ముగూడెంకు 30 కిలోమీటర్ల దూరంలో వెంకటాపురం మండలంలోని తలిపేరు ప్రాజెక్టు మాత్రమే వెంకటాపురం, దుమ్ముగూడెం మండలాలకు నీటిపారుదల కల్పించే ఏకైక ప్రాజెక్టు. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు ఈ రెండు మండలాల అవసరాలనూ తీర్చలేకపోతున్నది. డ్యాము ఎత్తు పెంచాలన్న స్థానిక ప్రజల డిమాండు పట్ల, అధిక వ్యయం కారణంగా ప్రభుత్వం ఎంతమాత్రం ఆసక్తి చూపడంలేదు.

వ్యవసాయంలో పంటల అధిక దిగుబడికి అత్యవసరమైన ప్రేరకం అంతరాయం లేని విద్యుత్ సరఫరా. ప్రపంచ వాణిజ్యసంస్థ నిబంధనల ప్రకారం ప్రభుత్వం విద్యుత్ ఉత్పాదక సంస్థలపై వ్యయాన్ని కత్తిరించి, ప్రైవేటు రంగంలో విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు అనుమతించడంపైనే ఆసక్తి చూపుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం వ్యవసాయరంగానికి విద్యుత్ సరఫరా చేయలేకపోతోంది. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడుతున్న కారణంగా, మోటార్లు కాలిపోవడం, పంటలు విఫలమవ్వడంతో రైతులు తీవ్ర నష్టాలను భరించవలసి వస్తోంది.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరాను పెంచే క్రమంలో ప్రభుత్వం ప్రభుత్వ పెట్టుబడులను పెంచడం కంటే, విద్యుత్ ఉత్పత్తి సరఫరా నష్టాలను కనీస స్థాయికి తగ్గించుకోవాల్సి ఉంది. ఈ అధ్యయన ప్రాంతంలోని రైతులు తమ పంటలను రక్షించుకోవడానికి గాను రోజుకు కనీసం 12 గంటలపాటు విద్యుత్ సరఫరా పొందడం కోసం, విద్యుత్ బోర్డు ప్రస్తుతం విధిస్తున్న ధరకంటే అధికంగా చెల్లించడానికి కూడా సిద్ధంగానే ఉన్నారు.

ముగింపు

వ్యవసాయ రంగంలో నీటిపారుదల, విద్యుత్, వ్యవసాయ పరిశోధనలు, రోడ్లు, మార్కెట్లు, సమాచార వ్యవస్థ మొదలైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వ పెట్టుబడులు క్షీణించడం అనేది చాలా కీలకమైన అంశం అవుతున్నది. పెట్టుబడుల క్షీణత వ్యవసాయాభివృద్ధిపై భవిష్యత్‌లో కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. ఎందుకంటే ఆహార భద్రత సాధించడానికి వ్యవసాయరంగమే అత్యంత ప్రధానమైనది. ప్రభుత్వ పెట్టుబడుల క్షీణత యొక్క ప్రతికూల ఫలితాలు నీటిపారుదల అభివృద్ధి మీదా, ఉపరితల జలవనరుల అభివృద్ధి మీదా తీవ్ర ప్రభావం చూపుతాయి. వ్యవసాయంపై ఆధారపడ్డ శ్రామికశక్తి భారం తీవ్రంగా పెరుగుతోంది. అందువల్ల వ్యవసాయంలో ఎలాంటి క్షీణత అయినా సమస్యని ఇంకా తీవ్రంచేస్తుంది. తక్కువ స్థాయి పెట్టుబడులు గ్రామీణ అసమానతల్ని ఇంకా పెంచుతాయి. గ్రామీణ పేదల సంఖ్యనూ పెంచుతాయి. తద్వారా ఆహార పదార్థాల ధరలు కూడా పెరుగుతాయి. దీంతోబాటు జల-పాక్షిక జలవనరులుగల రైతులు స్వల్ప వ్యవసాయాదాయాల కారణంగా సమర్థవంతమైన నీటిపారుదల సౌకర్యాల కోసం పెట్టుబడులు పెట్టలేరు. కనుక ఈ ప్రాంతాలలో రైతులు ప్రభుత్వ పెట్టుబడుల క్షీణతకు తప్పకుండా బలైపోతారు.

మంచినీటి పారుదల సమకూర్చుకోవడానికి అధిక పెట్టుబడులు పెట్టాల్సిరావడం అనేది-ధనిక రైతులకే నీటిసరఫరాను అందుబాటులోకి తెస్తోంది. ఈ బలహీన ప్రాంతాలలో నిజమైన బాధితులు పేదరైతులే. ఎందుకంటే వారి పరపతి పరిమితం. పైగా నీటిని ఎత్తిపోసేందుకు అవసరమైన విద్యుత్తు వ్యయం పెరిగిపోతోంది. అందువల్ల కొన్ని రాష్ట్రాల్లో రైతుల ఆత్మహత్యల్ని అరికట్టడం కోసం వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులను పెంచాలి. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని పత్తిరైతుల ఆత్మహత్యల్ని కూడా పరిశీలించాలి. అందుకు కూడా వ్యవసాయంలో ప్రభుత్వ పెట్టుబడులు క్షీణించడమే కారణమవుతున్నది.

వనరుల సమీకరణకు మరోరంగం వినియోగ ఛార్జీల వసూళ్ళు సరైన రాజకీయ సంకల్పం, నిర్వహణాచాతుర్యం ఉంటే నీటిపారుదల వ్యయాన్ని రాబట్టుకోవడం కష్టంకాదు. పంటల దిగుబడికి సహాయపడే నీటిపారుదల సౌకర్యాలకోసం చెల్లించడానికి రైతులు అంగీకరిస్తారని రావ్, కోయా 2002ల సర్వే చెబుతోంది.

కాలువలు, ఎత్తిపోతల పథకాలు, గొట్టపుబావులు మొదలైన మౌలిక సౌకర్యాల కల్పనపై పెట్టిన భారీ పెట్టుబడులు - సరైన నిర్వహణ లేక కొన్ని ప్రాంతాలలో నిరుపయోగమైన సంఘటనలు కూడా లేకపోలేదు. అందువల్ల కల్పించిన మౌలిక సదుపాయాలు వినియోగపడేలా నిర్వహించవలసిన అవసరం ఉన్నది. అప్పుడే అవి ఉద్దేశించిన ఫలితాలను నెరవేరుస్తాయి. ○

గోదావరి ఎత్తిపోతల పథకం - అంచనాల్లో అస్పష్టత

- ఎమ్. తిమ్మారెడ్డి

ఏదైనా నీటిపారుదల పథకం విషయానికొస్తే... 'విద్యుత్' అతి ప్రధాన అంశం అవుతుంది. ఆ పథకం మనుగడ విద్యుత్ లభ్యత, విద్యుత్ వ్యయంవంటి అంశాలపై ప్రధానంగా ఆధారపడి వుంటుంది. గోదావరి ఎత్తిపోతల పథక విషయంలోనూ ఈ విద్యుత్తే ప్రధానాంశం. విద్యుత్ లభ్యతపైనే గోదావరి ఎత్తిపోతల పథకం, మొత్తం ఆధారపడి వుందంటే అది అతిశయోక్తి ఎంత మాత్రం కాదు. ఈ విషయాన్ని ఉపేక్షిస్తే మాత్రం ఈ పథకం నిరర్థకంగానే నిలుస్తుంది. అనేక ఎత్తిపోతల పథకాల వైఫల్యానికి కారణం సైతం యిదే. అనేక మంది తెలంగాణా వాసుల కలల పంటైన ఈ పథకానికి ఆ దుస్థితి రాకుడదని కోరుకుందాం.

వాస్తవంగా దేవాదుల గ్రామం వద్ద గోదావరి నది ఒడ్డున ఈ పథకం నిర్మించాల్సివుంది. అరణ్య మార్గ నివారణకై ఈ పథకాన్ని గంగారం ప్రాంతానికి మార్చడం జరిగింది. 73 మీటర్ల ఎత్తున వున్న యిక్కడనుండి, 500 మీటర్ల ఎత్తున వున్న కంతాలపల్లికి నీటిని పంపాల్సి వుంటుంది. ఈ రెండింటి మధ్య ఆరు పంపింగ్ కేంద్రాలు వుంటాయి. ఈ పథక ప్రణాళికను పరిశీలిస్తే, 50 టి.ఎమ్.సిల నీటిని వినియోగించి, వరంగల్, కరీంనగర్, మెదక్, నల్గొండ జిల్లాలకు చెందిన ఏడులక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందివ్వడం లక్ష్యంగా కన్పిస్తుంది.

యిక్కడ పరిశీలనాంశాలు ఏంటంటే?

ఈ గోదావరి ఎత్తిపోతల పథకానికి విద్యుత్ ఏ మేరకు అవసరం కానుంది? ప్రస్తుత పరిస్థితుల్లో ఈ విద్యుత్ లభ్యమయ్యే అవకాశాలున్నాయా? లభ్యమైతే ఎంత వ్యయంతో కూడుకున్న పని యిది? ఇది కీలకాంశాలు.

వీటిలో ప్రధాన అంశం ఈ ఎత్తిపోతలకు ఎంత విద్యుత్ అవసరం?

విద్యుత్ వినియోగాన్ని అంచనా వేసేందుకు, ఈ పథకంలో వినియోగించనున్న మోటార్ల సామర్థ్యం... ఎత్తిపోతలను నిర్వహించనున్న కేంద్రాల భౌగోళిక వివరాలు... ఎంత ఎత్తున వున్నది... కేంద్రానికి మధ్య దూరం వంటి వివరణలు అత్యవసరం. అది లేకుంటే నిర్దిష్ట అంచనాలు కాజాలవు. అయినప్పటికీ సమస్య తీవ్రతను సుమారుగా అంచనా వేసే యత్నం చేద్దాం.

ఎత్తిపోతల పథకాల్లో సాధారణంగా.. నీటిని ఎత్తి పోసే కేంద్రాల ఎత్తును బట్టి విద్యుత్ వినియోగం మారుతూ ఉంటుంది, మన ఈ గోదావరి ఎత్తిపోతల పథక విషయానికొస్తే, తొలి దశలో 73 మీటర్ల ఎత్తున వున్న గంగారం నుండి 320 మీటర్ల ఎత్తున వున్న ధర్మ సాగరానికి నీటిని పంపాల్సి వుంటుంది. అంతిమ దశలో 500 మీటర్ల ఎత్తున వున్న కంతాలపల్లికి నీరివ్వాలి. తోలి అంచనాల ప్రకారం అ నీటి సరఫరా ఏడాదిలో 170 రోజులు, రోజుకు 24 గంటలు చెప్పున అందివ్వాలన్నది లక్ష్యం.

మొత్తం ఎత్తిపోతల పథకంలో అందివ్వాల్సిన నీరు 50 టిఎంసిలు. గంగారం నుండి ధర్మసాగరానికి నీటి పంపాలంటే 250 మీటర్ల ఎత్తుకు పంపాల్సి వుంది.. (ధర్మ సాగరం 320 మీటర్ల ఎత్తుకు వుంది. గంగారం 73 మీటర్ల ఎత్తున వుంది. ఒక టిఎంసి నీటిని పంపేందుకు 5 మెగ వాట్ల విద్యుత్ అవసరం అవుతున్నందున 50 టి ఎంసిల నీటిని పంపేందుకు 250 మెగవాట్ల విద్యుత్ సామార్థ్యం అవసరం అవుతుంది. అంటే, 1000 మిలియన్ యూనిట్ల విద్యుత్. అదే, 427 మీటర్ల ఎత్తున వున్న కంతాలపల్లి ట్యాంకుకు 50 టిఎంసిల నీటిని పంపాలంటే, ఒక టిఎంసికి 8.2 మెగావాట్స్ చొప్పున 410 మెగవాట్ల విద్యుత్ సామర్థ్యం అవుతుంది. అంటే 1650 మిలియన్ యూనిట్ల విద్యుత్.

పత్రికా కథనాల మేరకు ఈ ఎత్తి పోతల పథకంలో ఐదు పైపులైన్ల ను ప్రాధమిక దశలో వినియోగించనున్నారు. 2.5 మీటర్ల వ్యాసార్థం గల ఈ పైపుల ద్వారా 15 మెగావాట్ల విద్యుత్‌తో ధర్మసాగరానికి 5టిఎంసిల నీటిని పంపించాలని తొలుత నిర్ణయించారు.

ఆ తరువాతి క్రమంలో ఈ పైప్ లైన్ల ద్వారా ఈ విద్యుత్ వినియోగంతో 3.4 టిఎంసిల నీటినే పంపగలుగుతారని మరో అంచనా. కానీ నిర్దిష్ట గణాంక విశ్లేషణల ద్వారా అయితే 15 మెగావాట్ల విద్యుత్ వినియోగంతో మూడు టిఎంసిల నీటినే పంపగలుగుతాయని నిర్ధారించారు. మూడు టిఎంసిల నీటిని 15 మెగావాట్స్ విద్యుత్ సామర్థ్యంలో, అంటే 60 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం అవసరం అవుతుందన్నమాట.

అందుబాటులో వున్న యితర అంచనాల మేరకు, ఒక టిఎంసి నీటి వినియోగం ఆరు వేల ఎకరాల పల్లపు సేద్యానికి ఉపకరిస్తుంది. అదే మెట్ట భూములైతే 10 వేల ఎకరాలకు సరిపోతుంది. ఈ లెక్కన మూడు టిఎంసిల నీటి వినియోగంతో 30 వేల ఎకరాల మెట్ట భూములు సేద్యంలోకి రాగలుగుతాయి. యిదీ 60 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం. ఉదాహరణకు ధర్మసాగరం ఆయకట్ట 1600 ఎకరాలు మాత్రమేనట. కాగా, 60 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియెగంతో 5 హెచ్.పి సామర్థ్యం గల 8,125 పంపుసెట్లు

*(మిగతా **18**వ పేజీలో)*

విదేశీ పెట్టుబడులు లేకుండానే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- వి.హనుమంతరావు

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించటం, ఆహ్వానించడం గురించి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే వస్తున్న జవాబు ఏడు చేపల కథ గుర్తుకు వస్తుంది. ఎందుకెండలేదన్న కథ గుర్తుకు వస్తుంది. విదేశీ పెట్టుబడులను ఎందుకు అనుమతిస్తున్నారంటే మన వద్ద నిధుల్లేవు. నిధులెందుకు లేవు అంటే గృహపొదుపు పెరగటం లేదు, అందుచేత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలంటే విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడమొక్కటే మార్గమని అంటుంది ప్రభుత్వం. పొదుపు ఎందుకు తగ్గుతోంది? వడ్డీరేటు తగ్గిస్తూ పోతుంటే, పొదుపుకు అవకాశమే లేకుండా పోతోంది. ప్రభుత్వరంగ పరిశ్రమల నుంచి వచ్చే లాభాలు డివిడెండ్లు పొదుపుకు మరో మార్గం. కాని ప్రపంచ బ్యాంకు ఆదేశం మేరకు ప్రభుత్వరంగ సంస్థలను అమ్మివేయడం, లేదా ప్రభుత్వ ఈక్విటీ పెట్టుబడిని తగ్గించడమో చేస్తూ పోతే, అందులోనూ బంగారు గుడ్లు పెట్టే బాతును చంపేసినట్లు, బాగా లాభాలు, డివిడెండ్లు సంపాదించి పెడుతున్న నవరత్న పరిశ్రమలను కూడా బజారులో పెట్టి వేలం వేస్తుంటే, పొదుపు ఎలా సాధ్యమవుతుంది? ఇవన్ని ప్రభుత్వ విధాన వైఫల్యాలు. ఈ వైఫల్యాల మూలానే విదేశీ పెట్టుబడులకు ఎగబడాల్సి వస్తుంది. ప్రభుత్వరంగ సంస్థలు అనేకం నష్టాలు తెచ్చిపెడుతుంటే, ఆ వైట్ ఎలిఫెంట్స్‌ను ఎన్నాళ్ళు భరిస్తాం అని ప్రభుత్వం అంటోంది. వాటి నష్టాలకు కారణం, పరిశ్రమలు నడిపే అనుభవం బొత్తిగా లేని ఐ.ఏ.ఎస్. అధికారులను మేనేజింగ్ డైరెక్టర్లుగా నియమించటం కాదా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. ప్రభుత్వం లోటు బడ్జెట్లతోనే, అంటే నష్టాలతోనే నడుస్తుంది కాబట్టి ప్రభుత్వాన్నే అమ్మేద్దామా? కాలిమీద పుండు వేస్తే కాలే కోసేసుకొంటామా? ఆ మధ్య మునిగిపోతున్న యు.టి.ఐ.ని ఒడ్డున పడేయడానికి 17 వేల కోట్ల రూపాయలను బడ్జెట్ నుంచి ఇవ్వలేదా? ఇండియన్ బ్యాంకుకు దాని బాధ్యులు చేసిన తప్పిదాలకు ప్రభుత్వం పెట్టుబడులు పెట్టి, మేనేజిమెంట్‌ను మార్చటం వల్ల లాభాలబాటలో నడిచేలా చేయలేదా? రోగి జబ్బు తగ్గకపోతే మందులు మార్చవచ్చు; డాక్టరును మార్చవచ్చు; వేరే హాస్పిటల్‌కు వెళ్ళవచ్చు. కాని ఈ ప్రభుత్వ వైఖరిని చూస్తుంటే రోగిని చంపేయటమే మార్గమని భావిస్తున్నట్లు కనిపిస్తుంది. ఈ విషయం ఇంత దూరం ఎందుకు చర్చించాల్సి వచ్చిందంటే పెట్టుబడులు పెట్టడానికి నిధులు కావాలంటే, విదేశీ పెట్టుబడులను ఆహ్వానించనక్కర్లేదని, కేవలం యాజమాన్య పద్ధతులను సరిచేయటం జరిగితే, ప్రభుత్వరంగ సంస్థలు బంగారు గుడ్లుపెట్టే బాతులుగా మార్చవచ్చని, వాటి నుంచి పొదుపు నిధుల పెంచుకోవచ్చునని చెప్పడానికే.

రాష్ట్ర పారిశ్రామికీకరణ చరిత్ర పుటలు తిరగేస్తే 60వ దశకంలో కేంద్ర ప్రభుత్వరంగ పరిశ్రమల స్థాపనతో పారిశ్రామికీకరణ ప్రారంభమైంది. అప్పటి ముఖ్యమంత్రులు ఢిల్లీ, ముంబై, మద్రాసు, కలకత్తా లాంటి నగరాలు వెళ్ళి రోడ్‌షోలో పాల్గొని దేశీయ పారిశ్రామికవేత్తలను రాష్ట్రానికి ఆహ్వానిస్తూ వచ్చారు. పారిశ్రామిక కల్చర్‌ను గ్రామీణ ప్రాంతాల్లో విస్తరించటానికి పారిశ్రామిక ఎస్టేట్ల ఏర్పాటు, గడ్డి ముడి సరుకుగా ఉపయోగించి పేపరు మిల్లుల ఏర్పాటు, ఎ.పి.ఐ.డి.సి. లాంటి పారిశ్రామికాభివృద్ధి సంస్థలనేర్పాటు చేసి రాష్ట్రంలో ఔత్సాహిక పారిశ్రామికులతో జాయింట్ వెంచర్లు ఏర్పాటు చేయటం ద్వారా వారు పరిశ్రమలు పెట్టేలా ప్రోత్సహించటంలాంటి ప్రయత్నాలెన్నో జరిగాయి. కాని విదేశాలకు వెళ్ళి వారి పెట్టుబడులను ఆహ్వానించటం ఎపుడూ జరగలేదు. సంస్కరణలు ప్రారంభంలోనే విదేశాల వైపు చూడటమే కాదు, ఉన్న ప్రభుత్వరంగ పరిశ్రమలను మూసివేసే ప్రక్రియ ప్రారంభమైంది. పోనీ, అదైనా విజయవంతంగా సాగిందా అని చూడబోతే ఇప్పటికి సుమారు 10 సంవత్సరాలైనా, విదేశీ పెట్టుబడులతో స్థాపించిన మధ్యతరహా, భారీ పరిశ్రమ ఒక్కటీ రాలేదు. అదే విదేశీ పెట్టుబడుల ప్రపోజల్స్ ఆమోదం గురించిన లెక్కలను వల్లె వేసి, ఆ పరిశ్రమలనీ పెట్టేసినట్లు, పని ప్రారంభించినట్లు చూపించి పబ్బం గడుపుకొంటోంది ప్రభుత్వం. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రావాలంటే అలా వచ్చే వారు ఉన్న పరిశ్రమలను ప్రయివేటీకరించాలనే షరతు ప్రపంచ బ్యాంకు ద్వారా విధిస్తే, దానికీ రాష్ట్రం తలవంచింది. కాని పరిశ్రమలేవీ రాలేదు. పారిశ్రామికరంగం స్తంభించిపోయింది. పాతవి మూతబడ్డాయి; కొత్తవి రావటం లేదు. విజన్ 2020 పత్రం ప్రతీ ఏటా 11 శాతం చొప్పున పారిశ్రామికరంగం పెరుగుతూ వస్తుందని చెప్పింది. 2000-05 శాతానికి అనేక ప్రోత్సాహకాలు ప్రకటిస్తూ ఒక నూతన పారిశ్రామిక విధానాన్ని ప్రకటించింది. ఈ ప్రోత్సాహకాలతో విదేశీ పారిశ్రామిక విధానాన్ని ప్రకటించింది. ఈ ప్రోత్సాహకాలతో విదేశీ పారిశ్రామికవేత్తలు ఆకర్షితులవుతారని భావించింది. ఈ నూతన పారిశ్రామిక విధాన ప్రకటనకు ముందు కాలంలోనే 99-00 నాటికి రాష్ట్రంలో ఫ్యాక్టరీల సంఖ్య 94-95లో 16616 నుంచి 13164కు పడిపోయింది. ఖాయిలా పడ్డ పరిశ్రమలను పర్యవేక్షించే బి.ఐ.ఎఫ్.ఆర్.కు దక్షిణ రాష్ట్రాల నుంచి వెళ్ళిన పరిశ్రమల్లో 36.82 శాతం ఆంధ్రప్రదేశ్ నుంచే వెళ్ళాయి. మాన్యుఫ్యాక్చరింగ్ రంగంలో 2003 ఆఖరుకు 41000 చిన్న పరిశ్రమలు (మొత్తంలో 28 శాతం) ఖాయిలా పడ్డాయి. (వరల్డ్ బ్యాంక్ పత్రం)

ఈ నేపథ్యంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రాక ధోరణి మరోలా ఎలా ఉంటుంది? హైదరాబాద్ నగరంలో నల్లాల నుంచి నీరు ఎంత సన్నంగా వస్తుందో, ఇదీ అంత పేలవంగా ఉంది. ఈ కింది పట్టిక చూడండి.

సంవత్సరం	ఆమోదించిన ప్రపోజల్స్‌లో పెట్టుబడులు	వాస్తవంగా పెట్టుబడులు
1996	11018	1961
1997	9571	1377
1998	24645	5562
1999	2838	1119
2000	2346	1014
2001	52428	1673
2002	8474	1566
2003 (ఫిబ్రవరి వరకు)	393	257
మొత్తం	**174965**	**20836**

(ఆధారం : కేంద్ర వ్యాపార, పారిశ్రామిక మంత్రిత్వ శాఖ ప్రచురించిన న్యూస్‌లెటర్ ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల కమిషనర్)

పై పట్టిక ప్రకారం వచ్చిన పెట్టుబడి కేవలం 12 శాతం మాత్రమే. 1998లో తప్ప ఏ ఒక్క సంవత్సరంలోనూ విదేశీ పెట్టుబడుల రాక రు.1700 కోట్లు దాటి రాలేదు. ఈ పెట్టుబడులు కూడా కొత్త పరిశ్రమలను పెట్టడానికికాక ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న పరిశ్రమల్లో వున్నవారి ఈక్విటీ పెట్టుబడులను పెంచుకోవడానికి మాత్రమే. దేశంలో 1991-2002 ఆగస్టు మధ్య కాలంలో రు.284812.55 కోట్ల పెట్టుబడికి ఆమోదం తెలపగా, వచ్చినది లేదు. వ్రతం చెడ్డా ఫలం దక్కలేదు. విదేశీ పెట్టుబడులే చుక్క చుక్కలుగా వస్తే, దానితో పాటు వస్తుందనుకొన్న టెక్నాలజీ, మార్కెట్, పోటీ, నైపుణ్యత వచ్చిన జాడలే లేవు. దేశంతో పోల్చి చూస్తే, నిర్మాణంలో వున్న పరిశ్రమల్లో అక్టోబర్ 2002 - అక్టోబర్ 2003 మధ్యకాలంలో రాష్ట్రం శాతం 8.4 నుంచి 7.5 శాతానికి తగ్గింది.

వివిధ రాష్ట్రాల్లో ఆమోదించిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ధోరణి ఎలా వుందో ఈ కింది పట్టిక నుంచి తెలుసుకోవచ్చు.

ఆగస్టు 91 - మే 2002 మధ్య వివిధ రాష్ట్రాల్లో ఆమోదించిన విదేశీ మిలాఖత్ ఒప్పందాలు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు

	విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు	శాతం
ఆంధ్రప్రదేశ్	13068.7	4.7
అస్సాం	1.5	0.0
బీహార్	739.5	0.3
గుజరాత్	18453.2	6.6
హర్యానా	3519.4	1.3
కర్నాటక	21586.5	7.7
కేరళ	1526.9	0.5
మధ్యప్రదేశ్	9227.4	3.3
మహారాష్ట్ర	48660.2	17.4
ఒరిస్సా	8229.0	2.9
పంజాబ్	1968.4	0.7
రాజస్తాన్	3004.7	1.1
తమిళనాడు	23236.0	8.3
ఉత్తరప్రదేశ్	4791.6	1.7
పశ్చిమబెంగాల్	8802.3	3.1
ఇతరాలు	113626.7	40.5
ఢిల్లీ	33688.2	12.01
మొత్తం	**280442.1**	**100.00**

విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులు ముఖ్యంగా చూచేది రాష్ట్రంలో మౌలిక సౌకర్యాలు ఎలా వున్నాయి అనేది. అవి లేకపోవటమే కాదు; వాటిని సమీప భవిష్యత్తులో ఏర్పాటు చేయగలమనే నమ్మకం ముఖ్యమంత్రికే లేదు. అందువలన ప్రజల దృష్టిని హైటెక్‌కు, ఐ.టి.కి మళ్ళిస్తున్నారు. ఈ వైఫల్యం ఉద్యోగాల కోసం ఎదురు చూసేవారిని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. పరిశ్రమల్లో పెట్టుబడులు రాకపోతే, వ్యవసాయం దిగజారిపోతుంటే, ఉద్యోగావకాశాలే వుండవు. వారి కొనుగోలు శక్తి తగ్గుతుంది. పారిశ్రామిక ఉత్పత్తులకు మార్కెట్ లభించదు. రాష్ట్రం మరింత సంక్షోభంలో కూరుకుపోతుంది. ఏం చేయాలి?

ఇదివరకు కాంగ్రెస్ గాని ఇపుడు కేంద్ర ప్రభుత్వం గాని చేసిన పెద్ద తప్పు రాష్ట్రంలో పుష్కలంగా వున్న వ్యవసాయ వనరుల ఆధారంగా ఆగ్రో-ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటు మీద కేంద్రీకరించకపోవటమే. వరిగడ్డితో కాగితం తయారు చేశాం. దానితో ఎపుడూ ఊహించని గ్రామాల్లో కాగితం పరిశ్రమలు వెలిశాయి. అటవీ ఉత్పత్తులను అమ్మకం చేశాం. మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో పండించే ఆముదాలతో చాలా హై వాల్యూ ఉత్పత్తులను తయారు చేయవచ్చు. రిఫైండ్ ఆముదాన్ని విమానాల్లో ఉపయోగించవచ్చు. ఔషధాలు తయారుకు ఉపయోగించే మొక్కలున్నాయి. ఇలా అనేక అవకాశాలున్నా భారీ పరిశ్రమలు స్థాపించాలనే మోజులో పెరట్లో వున్న అవకాశాలను తృణీకరించాం. ఈ పరిశ్రమలను గ్రామీణ ప్రాంతాల్లోనే స్థాపించే అవకాశం వుంది. కాబట్టి స్థానికంగా పని చేసే వ్యవసాయ కూలీలకు వ్యవసాయ పనులు లేని కాలంలో ఉపాధి లభిస్తుంది. వాళ్ళు పొట్ట చేత పట్టుకొని పట్టణాలకు వలసపోనక్కర్లేదు. రైతులకు ఆదాయాలు పెరుగుతాయి; మాన్యుఫాక్చరింగ్ రంగంలో తయారయ్యే ఉత్పత్తులకు మార్కెట్ లభిస్తుంది. పరిశ్రమలు పెట్టండి, పెట్టుబడులు తీసుకొని రండి అని విదేశాలను దేబరించాల్సిన పని వుండదు. 18 గంటలు పని చేస్తానని చెప్పుకొనే ముఖ్యమంత్రి ఈ దిక్కుగా ఎందుకు కష్టపడడం లేదు. విదేశీయుల ముందు చేయి చాచాలనే ఆలోచన ఎందుకు వచ్చింది? ఏ ఆధునిక టెక్నాలజిని రాష్ట్రానికి తీసుకొని రావాలనుకొంటున్నారో, ఆ టెక్నాలజిని వ్యవసాయ రంగంలో ప్రయోగిస్తే రాష్ట్రం ఎవరి సహాయం లేకుండానే ముందుకు పోగలుగుతుంది. ○

(ఇందులోని గణాంకాలు ఇటీవల భీమవరంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ అసోసియేషన్ వార్షిక సమావేశంలో ఎన్.శ్రీదేవి, జి.చంద్రప్రసాద్ సమర్పించిన పత్రాల నుండి సేకరించబడ్డాయి)

కోస్తా ఆంధ్రలో మహిళా వ్యవసాయ కూలీలను దెబ్బతీసిన మత్స్యసాగు

– బి.చిన్నారావు; కె.వి.గిరిబాబు

కోస్తా ఆంధ్రా అనగా మనకు గుర్తుకు వచ్చేది పచ్చని వరిచేలు, కొబ్బరి, చెరుకు, అరటి మొదలగు పంటలు. కాని అవి క్రమేపీ కనుమరుగయ్యే వాతావరణం కానవస్తుంది. దీనికి ప్రధాన కారణం చేపలు, రొయ్యల సాగుతో ధనార్జన. దీనివలన ఈ ప్రజానీకం పోగొట్టుకునేది కాలుష్య రహిత వాతావరణం, ఉపాధి. ముఖ్యంగా వరి పొలాలలో పని చేసేది మహిళలు. ఒక హెక్టారు వరి సాగుకు సుమారు 74 పని దినములు మహిళలు పని చేస్తారు. మత్స్యసాగు విషయంలో మహిళలకు ఉపాధి అవకాశాలు అరుదు. కొద్దిమంది పురుషులతో మత్స్యసాగు చేయవచ్చు. ప్రతీఏట వేల ఎకరాలు, చేపలు/రొయ్యలు సాగుకు మార్చబడుచున్నవి. కొత్త, కొత్త సంస్థలు ఈ సాగుకు ఉత్సాహం చూపుతుండడంతో, చిన్న రైతులు సైతం వీరితో చేతులు కలుపుచున్నారు. కావున రానున్న రోజులలో దీని ఫలితం కొద్దిమంది పెట్టుబడుదారులు పొందుతారు. సామాన్యులు మాత్రం ఉపాధి పోగొట్టుకొని, వాతావరణం, నీరు, కాలుష్యంతో పాటు వేరొక ఉపాధి కొరకు వలసలు పోయే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ దుష్పరిమాణామాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గమనిస్తూ ఈ వ్యవసాయ భూములు మార్చిడికి ఏ ఆటంకం తెలుపుట కాని, నియంత్రించటం కాని చేయలేదు. ఇది చాలా విచారకరం.

జిల్లాల వారీగా ఆంధ్రప్రదేశ్‌లో 2001వ సంవత్సరము వరకు మత్స్యసాగు కొరకు మార్చబడిన వ్యవసాయ భూముల వివరాలు

సంఖ్య	జిల్లా పేరు	భూమి విస్తీర్ణము (హెక్టారులలో)
1.	శ్రీకాకుళం	116.50
2.	విజయనగరం	9.00
3.	విశాఖపట్నం	270.30
4.	తూర్పుగోదావరి	4180.50
5.	పశ్చిమగోదావరి	22577.18
6.	కృష్ణా	30482.69
7.	గుంటూరు	10861.13
8.	ప్రకాశం	2316.50
9.	నెల్లూరు	5596.00
10.	చిత్తూరు	66.00
11.	అనంతపురం	77.15
12.	కర్నూలు	205.66
13.	కడప	40.00
14.	ఖమ్మం	23.20
15.	వరంగల్	17.11
16.	కరీంనగర్	3220.00
17.	ఆదిలాబాద్	21.00
18.	మహబూబ్‌నగర్	200.00
19.	నల్లగొండ	7.00
20.	నిజామాబాద్	9.80
		80,296.72

మూలం : మత్స్యశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

పై పట్టికను బట్టి మనకు తెలిసేదేమిటంటే, 2001వ సంవత్సరాంతానికి, ఆంధ్రప్రదేశ్‌లో 80,296.72 హెక్టార్ల వ్యవసాయ భూమి మత్స్యసాగు క్రింద మార్చబడింది. ఈ భూమిలో 75 శాతం మంచినీటి వనరులతో అధిక ఫలసాయమిచ్చే రెండు పంటలు పండే సారవంతమైన భూమి. ఇది చాలా వరకు పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాలకు చెందింది.

కాలమాన పరిస్థితలను బట్టి, ఆంధ్రప్రదేశ్ జనాభా చేపట్టే వృత్తులలో, వివిధ మార్పులు చోటు చేసుకొంటున్నాయి. 1971వ సంవత్సరంలో 75.99 శాతం పురుషులు, 87.03 శాతం స్త్రీలకు వ్యవసాయమే ప్రధాన ఆధారం. మిగిలిన వారు వివిధ వృత్తులపై ఆధారపడేవారు. కాని క్రమేణా 2001వ సంవత్సరానికి 69.75 శాతం పురుషులు, 62.36 శాతం స్త్రీలకు మాత్రమే వ్యవసాయం ప్రధాన ఉపాధి. వ్యవసాయేతర వృత్తులపైన వీరు మొగ్గు చూపటం జరిగింది. దీనికి కారణం అక్షరాస్యత, రాబడి, వ్యవసాయం అందరికీ ఉపాధి అవకాశాలు కరువవడం మొదలైనవి. రానురాను వ్యవసాయ కూలీలకు ప్రాధాన్యం లేకపోవుట, తక్కువ రాబడి, అధిక ప్రయాస, నష్టం, అనిశ్చితత్వం మొదలగునవి.

వ్యవసాయేతర వృత్తుల మీద ఆధారపడ్డ వారి సంఖ్య డెల్టా ప్రాంతాల కంటే, మెట్ట ప్రాంతాలలోనే ఎక్కువ. ఇది సహజం. వ్యవసాయ కూలిపని లేక వీరు ఇతర వృత్తులపై ఆధారపడుచున్నారు. కాని డెల్టా ప్రాంతాలలో ఇంకా వ్యవసాయమే ప్రధానం. దీనికి ముఖ్య కారణం, రెండు పంటలు పండించడం. దాని వలన వ్యవసాయ కూలీలకు గల ఉపాధి. కాని ఈ పరిస్థితి మత్స్యసాగు మూలంగా క్రమేపీ ఈ జిల్లాలలో కుంచించుకుపోవడం మనకు కంటికి కట్టినట్లు గణాంక వివరాల వలన అర్థమవుతుంది. ఈ మత్స్యసాగు వలన ఏటా రెండు వరి పంటలు కలిపి 118.83 లక్షల పనిదినములు గ్రామీణులు ఉపాధి కోల్పోతున్నారు. ఇది మరింత ఉధృతమై, భవిష్యత్తులో మిగిలిన పంట పొలాలకు, పంటలకు వినాశకారి అవుతుంది. మత్స్యసాగు/పరిశ్రమ కల్పించు ఉపాధి అవకాశాల కంటే హరించుకునే అవకాశాలే మెండుగా కన్పిస్తున్నాయి.

ఉపాధి అవకాశాలను పరిగణనలోకి తీసుకుంటే, సమతుల్యం పాటించవలసి ఉంది. కావున మత్స్యసాగు కంటే పంట పొలాలను రక్షించుకొనుటకు ముఖ్యం. పనికిరాని చవుడు భూములు, సముద్ర జలాలకి దగ్గరలో వున్న భూములు ఈ మత్స్యసాగుకి పూర్తిగా వినియోగించి, మంచివనరులు ఉన్న వ్యవసాయ భూములను ఈ సాగు నుండి నియంత్రించిన ఉపాధి పెరిగి వ్యవసాయ కూలీలకు లోబడి పెరుగుతుంది. ఈ వ్యర్థ పదార్థాల నుండి తాగునీరు, సాగునీరు విషతుల్యం కాకుండా పరిరక్షించబడుతుంది. యుద్ధ ప్రాతిపదిక మీద పంటభూముల మార్పిడిని ఆపాలి. ముఖ్యంగా స్త్రీలు ఈ విపత్తుని అర్థం చేసుకని, మహిళా సంఘాలన్నీ ఏకమై ఈ దుస్థితిని అడ్డుకోవాలి. ○

పర్యావరణం -4

ఫార్మాసిటీ కాలుష్యనీడలో 'పరవాడ'!

స్వదేశీ, విదేశీ మందుల కంపెనీల అవసరాలను తీర్చేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశాఖపట్టణానికి దక్షిణంగా 33 కి.మీ. దూరంలో వున్న పరవాడ దగ్గర ఒక ఫార్మాసిటీని నిర్మించతలపెట్టింది. దీనికిగాను ఎ.పి.ఐ.ఐ.సి. (ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) 865 హెక్టార్ల భూమిని కేటాయించింది. ఎల్ అండ్ టి రామ్‌బోల్ కంపెనీ కన్సల్టెంట్‌గా వ్యవహరించింది. ఈ సంస్థ పరిశ్రమల్లో విడుదలయ్యే వ్యర్థాలను తిక్కవానిపాలెం, పాలవలస గ్రామాల మధ్యగా 15 కి.మీ. పొడవైన పైప్‌లైన్‌ను నిర్మించి దాని ద్వారా సముద్రంలో కలిపేయాలని సూచించింది.

అయితే టెక్నికల్ కమిటీ ఈ అసైన్‌మెంట్‌ను పరిశీలించి ఇందులోని లోపాలను ఎత్తిచూపింది. వాటిలో ఇవి కొన్ని.

1. ఈ నివేదిక, ఫార్మాస్యూటికల్ పరిశ్రమల నుంచి వచ్చే భరించలేని వాసనల ప్రభావం పరిసరాలపై ఎలా ఉండగలదో సరిగ్గా పట్టించుకొన్నట్లు లేదు.
2. సోడియం డైయాక్సైడ్‌లాంటి కొన్ని రసాయనాలకు సంబంధించిన సాంకేతిక విషయాలను చర్చించారే తప్ప, వీటిని ఫార్మాస్యూటికల్ పరిశ్రమలో వాడటం వలన, వెలువడే ప్రమాదకరమైన వాయువులు, వ్యర్థాలు అక్కడి గాలిని ఏ విధంగా కలుషితం చేస్తాయో ఈ నివేదిక తెలుపలేదు.
3. థానమ్ అనే గ్రామాన్ని ఈ ఫార్మాసిటీ మూడు ప్రక్కలా ముట్టడించి ఉన్నందువల్ల, దానిపై తీవ్రమైన వాతావరణ కాలుష్యం ఏ విధంగా ప్రభావం చూపించగలదన్న వివరాలు వెల్లడించలేదు.
4. ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఈ వ్యర్థాలను సముద్రంలో కలపదలచిన ప్రాంతంలోనే ఎన్.టి.పి.సి. సంస్థకు చెందిన వాటర్ఇన్‌టేక్ పాయింట్ ఉండటంతో, అక్కడ ఈ వ్యర్థాల ప్రభావం వలన ఆ నీటి నాణ్యత తగ్గే ప్రమాదం ఉంది.

దీనికి తోడు జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ద్వారా చేసిన పరిశీలనా ఫలితాలు ఈ పరవాడ ప్రాంతంలో వాతావరణ జలకాలుష్యాలను వీలున్నంత తక్కువ స్థాయిలో ఉండేట్లు చూడవలసి ఉందనీ, కేవలం అటువంటి తక్కువ స్థాయి కాలుష్య కారక పరిశ్రమలకు మాత్రమే అనుమతి ఇవ్వాల్సి ఉంటుందని తేల్చాయి.

అయితే, రాంబోల్ కంపెనీగానీ, టెక్నికల్ కమిటీగానీ, సముద్రంలో కలుపలచిన ఈ విషపూరిత వ్యర్థాలను నిర్వీర్యపరిచే చర్యల గురించి వివరించలేదు. అంతేకాకుండా కోస్తా సముద్రతీర ప్రాంతపు పర్యావరణంపై దీని దుష్ఫలితాలు ఏ విధంగా ఉంటాయో ఎటువంటి వివరాలు అందించలేదు. అయినప్పటికి విభ్రాంతికరంగా ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ పై విషయాలన్నిటినీ పట్టించుకోకుండా ఈ ఫార్మాసిటీకి ఆగస్టు 2002లో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసంది. ఈ ఫార్మాసిటీలో 61 మందుల కంపెనీలను, 32 మూల పదార్థాలను ఉత్పత్తి చేసే యూనిట్లను నెలకొల్పదలచారు. ఇందుకు ఏలేరు కెనాల్ నుండి నీటిని తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. విశాఖ/పట్నం ఇండస్ట్రియల్ ఏరియా మొత్తం వాడే నీటికి ఇది సమానం. ఇంకో భయంకర విషయం. ఈ ఫార్మాసిటీ నుంచి రోజుకు కనీసం 300 లక్షల లీటర్ల వ్యర్థ జలాలు విడుదలవుతాయి. ఇది హైదరాబాద్ దగ్గరున్న అత్యంత కాలుష్యపూరిత ప్రాంతాలుగా చెప్పబడే 'బొల్లారం, పటాన్‌చెరు, జీడిమెట్ల' ఇండస్ట్రియల్ ఏరియాలు మొత్తంలో ఉత్పత్తయ్యే వ్యర్థ జలాల కంటే మూడురెట్లు ఎక్కువ! పైగా ఇవి ఫార్మాస్యూటికల్ యూనిట్ల వ్యర్థాలవడం వలన వీటి ప్రభావం మామూలు కంటే ఎక్కువ ప్రమాదకరమే కాకుండా సముద్రతీర ప్రాంత మత్స్య సంపదపై, కోస్తా ప్రాంత వనరులపై దీర్ఘకాలిక ప్రభావాలు చూపిస్తాయి.

అసలు ఇటువంటి ఫార్మాస్యూటికల్ పరిశ్రమలను, సముద్రాలకు దగ్గరగా ఎందుకు స్థాపిస్తారంటే వాటిలో విడుదలయ్యే విషపూరిత వ్యర్థాలను సముద్రంలో కలిపేస్తే అవి పల్చబడి, ప్రమాదకరం కాకుండా పోతాయి కదా అని! అయితే ఈ ప్రక్రియలో సముద్రంలో కలపబడే ఆ విషపూరిత వ్యర్థాల ప్రమాద తీవ్రతాశాతాన్ని తగ్గించడానికి కనీసం కొన్ని జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం కనిపిస్తోంది. ఎందుకంటే సముద్రంలో కలపబడే ఆ వ్యర్థాలన్నీ తప్పనిసరిగా నీళ్ళలో కలిసిపోయి పల్చబడతాయన్న గ్యారంటీ ఏమీ లేదు కాబట్టి.

కాబట్టి ప్రస్తుతం ఇటువంటి ఫార్మాస్యూటికల్ కంపెనీలు పరవాడ పరిసర ప్రాంత పర్యావరణంపై చూపగల దుష్ప్రభావాన్ని సరిగ్గా అంచనా వేయకుండా వాటిని స్థాపించడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వకూడదు. ఒకవేళ స్థాపించినా ఈ కంపెనీలు విడుదల చేసే వ్యర్థాలు సముద్ర జలాలకు కలిగించగల నష్టాలను బేరీజు వేయకుండా వాటిని సముద్రంలో కలపడానికి అనుమతించకూడదు.

('సమ్మతి' సౌజన్యంతో)

ఈ వాదనలు ప్రజల ముందు జరుగుతున్నవి కావు !

- ఇప్పు వీరారెడ్డి

రాష్ట్రంలో అధికార పాలక పార్టీ అధినేత ఆపద్ధర్మ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి, ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, తెలంగాణా రాష్ట్ర సమితి పార్టీల మధ్య నక్సలైట్ కార్యాచరణను కేంద్రంగా చేసుకుని ఆసక్తిదాయకమైన సంవాదమొకటి కొనసాగుతుంది. 'విపక్షాలకు నక్సలైట్లకు మధ్య అధికార పార్టీ నేతలను హతమార్చేందుకు రహస్య ఒప్పందం కుదిరిందని, ప్రతిపక్షాలు నక్సలైట్లతో మిలాఖతైనాయ'ని తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుని ఆరోపణ? అంతే వేగంతో విపక్షాలు 'తమకు నక్సలైట్లతో ఎలాంటి సంబంధాలు రహస్య ఒప్పందాలు లేవని, దానికి సంబంధించిన ఆధారాలేవైనా పవర్ పార్టీ వద్ద ఉన్నట్లైతే బహిరంగపర్చి తమను అరెస్టు చేసుకోవచ్చుని, తమ పార్టీని నిషేదించవచ్చుని, ఘాటైన ఖండనలను పత్రికలకు విడుదల చేస్తున్నాయి. నక్సలైట్లను వారి కార్యాచరణను కేంద్రంగా చేసుకుని కొనసాగుతున్న ఈ వాదప్రతివాదనల సంవాదం అప్పుడప్పుడు వినబడుతూనే ఉన్నా ఎన్నికల వాతావరణం ప్రారంభమైనప్పటి నుండి క్రమక్రమంగా ఈ పంచాయతీ తీవ్రత పెర్గుగుతుంది. ఎన్నికల సమయంలోనే ఈ వాదప్రతివాదనలు తీవ్రమవ్వడానికి గల ప్రాముఖ్యతను విశ్లేషించాల్సి ఉంది.

రోజూ వార్తాపత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాను గమనిస్తున్న వాళ్లకు ఇదేదో తమ ముందు ఇటు అధికారపార్టీ, అటు విపక్ష పార్టీలు ఒకరు ఒకరిపై చేసుకుంటున్న నిందారోపణల ప్రయత్నంగా తోచవచ్చు. అట్లా అనిపించడానికి గల కారణమూ ఉంది.

రాజకీయ పార్టీలు (పార్లమెంటరీ) ప్రజలతో మొదలై ప్రజలతో పూర్తయ్యే విధంగా తమ ప్రారంభం, గమనం, గమ్యంలను ప్రకటించుకోవడం పై విధంగా భ్రమపడడానికి ఒక కారణం. తాము ఆలోచిస్తున్న, రూపొందిస్తున్న, ప్రకటిస్తున్న, అమలుపరుస్తున్న విధానమంతా ప్రజలనే లక్ష్యంగా చేసుకున్నట్లు (నిజంగా ప్రజలనే లక్ష్యంగా చేసుకుంటున్నారు. కాని వేరే కోణంలో) తరచుగా ఊదరగొట్టడంతో సహజంగానే ఇలాంటి వాదనలు, ప్రతివాదనలు తమ ముందు ప్రకటించుకుంటున్న నిజాయితీ ప్రయత్నాలుగా ప్రజలు భావించడం సహజమే. కానీ పైకి వినబడుతున్న, పైకి కనబడుతున్న ఈ తగాదా వెనుక కనబడని రహస్యమొకటుంది.

దోపిడీ వర్గాల ప్రతినిధిగా ప్రభుత్వ పాలన కొనసాగుతున్న వర్గ సమాజంలో పాలక పార్టీలు శ్రామిక వర్గ ప్రయోజనాలను ఫణంగా పెడుతూ, సంపన్న వర్గాల ప్రయోజనాలను కాపాడడమొక్కటే కాదు, దినదినం అభివృద్ధి చేసే లక్ష్యంగా విధానాలను రూపొందిస్తూ అమలు పరచడం అన్నది, అధికార విపక్ష పార్టీల మౌలిక స్వభావంగా ఉంటుంది. అలాంటి పాలక పార్టీలు ఐదేళ్లకోసారి అవకాశం రాగల అధికార మార్పిడి (రానురాను అంతదాకా వేచిచూసే ఓపిక నశించినట్టుంది! కచ్చితమైన కాలనిర్ణయానికి హద్దులు తీసేశారు) సమయంలో ప్రారంభమైన ఈ సంవాదాన్ని ప్రజలు (శ్రామిక వర్గాలు) అర్థం చేసుకోవాల్సి ఉంది.

దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా శ్రామికవర్గ ప్రయోజనాల కోసం ప్రత్యామ్నాయ రాజకీయార్థిక కార్యాచరణవిధానాన్ని రూపొందించుకుని ముందుకు సాగుతున్న ప్రగతి శీల సంస్థ (నక్సలైట్ పార్టీలు)లపై పాలక పార్టీలకు చాలా స్పష్టమైన అవగాహనే ఉంది. అధికార, పాలక పార్టీ తమ యజమానుల (దోపిడీ వర్గంలోని కొన్ని సెక్షన్‌లు) ప్రయోజనాలను పూర్తిగా కాపాడే బృహత్ కార్యక్రమాన్ని ఎంతో విశ్వాసంతో సక్రమంగా కొనసాగిస్తుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ అధికార పీఠం నుంచి వైదొలగడం ద్వారా విపక్షాలకు (దోపిడీ వర్గంలోని మరొక సెక్షన్ సేవకులు) పాలనా బాధ్యతలను అప్పగించడానికి అంగీకరించదు. ఇలా అధికారం నిలబెట్టుకోవడానికి ప్రతిపక్ష పార్టీలతో చేస్తున్న ఎన్నికల పోరాటంలో మొట్టమొదటిసారిగా నక్సలైట్ కార్యాచరణను కేంద్రబిందువుగా చేస్తుంది. ప్రజల ముందే బహిర్గతపరుస్తున్నట్లు కనిపించే ఈ పంచాయతీ నిజానికి తమ యజమానుల (దోపిడీ వర్గాల)ను ఉద్దేశించి చేస్తున్నదే. 'విపక్షం దోపిడీ ప్రత్యామ్నాయ ప్రజా రాజకీయ విధానానికి ప్రతినిధులైన నక్సలైట్ సంస్థలతో మిలాఖతైంది కాబట్టి అధికారం వాళ్ల చేతుల్లోకి పోయినట్లయితే పాలనా విధానాలు యావత్తు శ్రామికవర్గ పక్షాన రూపొందుతాయ'నే హెచ్చరికను తమ యజమాని వర్గంతోపాటు, విపక్ష యాజమాన్య వర్గాలనుద్దేశించి ఇస్తున్నటువంటిదే, తెలుగుదేశం పార్టీ విపక్షాలమీద చేస్తున్న ఆరోపణ వెనుకనున్న అసలు సందేశం. దానికి తమ యాజమాన్య వర్గాలు ఎక్కడ ఆ అసత్య ఆరోపణలను నమ్ముతాయోనన్న భయంతో వెంటనే 'ఎలాంటి రాజకీయ రహస్య ఒప్పందాలను తాము నక్సలైట్ పార్టీలతో కుదుర్చుకోలేదని, ఇది

వైరివర్గం తమ మీద చేస్తున్న కుట్రపూరిత నిరాధారమైన ఆరోపణ అని విపక్షాలుసైతం అటు, ఇటుగా గల ఉమ్మడి యాజమాన్య వర్గానికి స్పష్టం చేసుకుంటున్నాయి. అంతే తప్ప ఈ వాదప్రతివాదనలు ప్రజలనుద్దేశించి, ప్రజల కొరకు కానేకాదు. మొత్తం మీద ఇటు అధికారపార్టీకిగాని, అటు విపక్ష పార్టీలకుగాని అధికారం నిలబెట్టుకోవడంలోనైనా, అధికారం గుంజుకోవడంలోనైనా ప్రధాన భూమికను పోషిస్తున్న జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారి వర్గాలు, భూస్వామ్య వర్గాల ముందు చేస్తున్నదే ఈ గొడవంతా. తద్వారా వారి దయాదాక్షిణ్యాల నుండి దూరం కాకూడదన్నదే ఈ పంచాయతీ లక్ష్యం. అధికార పార్టీ నక్సలైట్ కార్యాచరణ విధానాన్ని విపక్షాలకు అంటగట్టి యజమానుల ప్రాపకం నుండి దూరం చేయడం ద్వారా అధికారాన్ని సుస్థిరం చేసుకోవాలనుకుంటే, అధికార పార్టీ మాటలు నమ్మవద్దని, తాము సర్వదా తమ సేవకులమేనని, కాబట్టి రేపటి ఎన్నికల్లో తమ కరుణాకటాక్షాలు తమపై ఉంచాలన్నదే విపక్షాల రోదన. ఇదంతా అర్థం కాకపోవడానికి గల కారణం సమాజాన్ని వర్గసమాజంగా అర్థం చేసుకోకపోవడం. వర్గసమాజంలో దోపిడీ వర్గాల ప్రతినిధులుగా పాలనను కొనసాగిస్తున్న పాలకపార్టీలపాలన సమాజంలో ప్రజలందరికి సంబంధించిందేనని భ్రమపడటం.

నిజానికి పరిపాలనంతా ప్రజల పేరుతో ప్రజల కొరకే జరుగుతున్నట్లు కనబడుతుంది కానీ ఆ ప్రజలు వర్గ (సంపన్న) ప్రజలన్న విషయాన్ని అర్థం చేసుకోవాలి. ప్రజల పేరుతో పాలకపార్టీలు మాట్లాడుతున్న భాషంతా వర్గప్రజలకు సంబంధించిందే. చంద్రబాబు నాయుడు ఇటీవల నక్సలైట్ల బారినుండి రక్షణ కొరకు ప్రజలకు తుపాకులిస్తానన్న అంశాన్ని కూడా ఇదేరకంగా అర్థం చేసుకోవాల్సి ఉంది.

సైద్ధాంతిక కోణంలో ఈ చర్చను కాసేపు పక్కనబెట్టి చూసినా, చంద్రబాబు విపక్షాల మీద నక్సలైట్లతో కుమ్మక్కయ్యారని, నిజంగానే ప్రజలనుద్దేశించి వాదన చేయడం ద్వారా ప్రయోజనం పొందగోరినట్లయితే ఆవాదనను సాధారణ ప్రజలుగా గల శ్రామికవర్గాలు నిజమని నమ్మగలరా? అట్లా నమ్మించగలడా?

కేవలం నమ్మడం మాత్రమే కాదు. ఈ నమ్మడంలో రెండు అంశాలున్నాయి. ఒకటి నక్సలైట్లు అరాచక, హింసావాదులని, అభివృద్ధి నిరోధకులని నమ్మడం, రెండు, అలాంటి వారితో విపక్షాలు మిలాఖతైనాయని నమ్మడం. ప్రజలు ఈ రెండు అంశాల్ని తమంతతాముగా అయినా నమ్మాలి. లేదా వాళ్ళను తానైనా నమ్మించాలి, ఇప్పుడా స్థితి ఉందా? అసలీ నమ్మించడమేమిటి? ఒప్పించాలిగాని. చాలా మంది నమ్మించడం, నమ్మడం, ఒప్పించడం లాంటి పదాలను ఒకే అర్థంలో వాడుతుంటారు. కాని అది సరికాదు. నమ్మించడం అంటే ఎత్తుగడకు సంబంధించినదవుతుంది. ఒప్పించడం అంటే విధానానికి సంబంధించినదవుతుంది. విధానానికి భిన్నంగా ఆచరణ ఉన్నప్పుడే నమ్మించడం అనివార్యం అవుతుంది.

తమ కోసమే తమ ఆకాంక్షలు, ప్రయోజనాలే ఎజెండాగా కలిగి సంపన్నవర్గ రాజకీయాలకు ప్రత్యామ్నాయ శ్రామికవర్గ రాజకీయార్థిక విధానాన్ని విస్పష్టంగా ప్రకటిస్తున్న నక్సలైట్ సంస్థలతో ప్రస్తుత పాలక పార్టీలు ఒప్పందం చేసుకోవడం అన్నది ఎన్నటికీ జరగదనే కనీసపు అవగాహన ప్రజల్లో ఉంది. నక్సలిజం ప్రారంభమైన మూడున్నర దశాబ్దాలుగా ఈరోజు వరకు పాలక పార్టీలేవీ నక్సలైట్లను హింసావాదులుగా, అరాచకవాదులుగా ప్రగతినిరోధకులుగా ఒప్పించడం కాదు కదా కనీసం నమ్మించలేకపోయారు. అది పూర్తిగా అసాధ్యమైపోతున్న ప్రజల ఎజెండాకు సంబంధించిన వారి పాలనా విధానానికి సంబంధించిన అంశం. ఈ వైఫల్యమే నక్సలైట్ ఉద్యమానికి కారణం అవుతుంది.

చంద్రబాబు దృష్టిలో నక్సలైట్లు హింసా, అరాచకవాదులు, అభివృద్ధి నిరోధకులైనప్పుడు విపక్షాలు వారితో కలువకపోతేనే నష్టం కాని, వారితో కలిస్తే తనకే లాభం కదా! అట్లా కలవడం, కలిసిపోయారని ప్రజలు నమ్మడం తనకెంతో లాభం. ఇంకెందుకీ గొడవ ? ఎందుకంటే ప్రజల దృష్టిలో నక్సలైట్లకున్న స్థానం, అర్థం, నక్సలైట్లపట్ల తాను ప్రచారం చేస్తున్న అర్థాలు ఒకే రకంగా లేవు గనుక. అందుకే ఈ గొడవ.

ఇదిలా ఉంటే చంద్రబాబు విపక్షాల మీద చేస్తున్న ఈ ఆరోపణ ప్రకారం, విపక్షాలను నక్సలైట్ స్థానానికి ఎత్తినట్లా? దించినట్లా? లేదా నక్సలైట్లను విపక్ష పాలక పార్టీల స్థాయికి దిగజార్చినట్లా? పెంచినట్లా? ఆయన దృష్టిలో ఎవరికి ఏ స్థానం ఇస్తున్నట్లు? ఇప్పటిదాకా చేసిన విశ్లేషణ ప్రకారం చంద్రబాబు దృష్టికోణం, ప్రజల దృష్టికోణం కాదు. ఆయన విశ్లేషణ శ్రామికవర్గ విశ్లేషన కాదు. ఆయన దృష్టిలో దిగజారిన స్థానం నక్సలైట్లదే. ఉన్నతమైన స్థానం విపక్షాలదే. విపక్షాల ప్రతిస్పందనలోనూ ఇదేవిధమైన స్థానాలు. విపక్షాలకు అధికారం దొరకకుండా ఉండేందుకు ఒకవైపు తమ పాలకపార్టీ ప్రభువుల ముందు నక్సలైట్ల కార్యాచరణకు అశేష పీడితవర్గకార్యాచరణగా వాస్తవంగానే చూపెడుతూ, మరొకవైపు తమ ప్రచార ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజల ముందు నక్సలైట్ల కార్యాచరణను విధ్వంసపూరితంగా నిరూపించేందుకు, అభివృద్ధి నిరోధకమైనదిగా రుజువు చేసేందుకు చంద్రబాబు చేస్తున్న ప్రయత్నం పాలక పార్టీలన్నింటికి ఆదర్శంగానే ఉంటుందనడంలో సందేహం లేదు. ○

ఔట్‌సోర్సింగ్ వివాదానికి పరిష్కారమేమిటి?

- గుడిపూడి విజయరావు

నేడు అమెరికాలో ఔట్ సోర్సింగ్‌పై వివాదం తారాస్థాయికి చేరింది. గత ఫిబ్రవరి 9న అమెరికా అధ్యక్షుడు బుష్ ప్రధాన ఆర్థిక సలహాదారు గ్రెగరీ మాంకివ్ "ఔట్ సోర్సింగ్ దీర్ఘకాలంలో అమెరికా ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనకరం" అని వ్యాఖ్యానించడం ఈ వివాదం తీవ్రమవడానికి దారితీసింది. గతంలో మాన్యుఫాక్చరింగ్ రంగంలో ఉద్యోగాలు మెక్సికో, చైనా, మలేషియా లాంటి దేశాలకు తరలిపోతున్నప్పుడు అవన్నీ తక్కువ వేతనాలు లభించే ఉద్యోగాలు, వాటి గురించి మీరేమీ ఆందోళన చెందవద్దు. అధిక వేతనాలు లభించే సర్వీసు రంగ ఉద్యోగాలు మీకే ఉన్నాయి అని అమెరికా ప్రజలను పాలకులు సమాధానపరుస్తూ వచ్చారు. కాని ఇప్పుడు ఆ సర్వీసు ఉద్యోగాలు, అందులోను అధిక నైపుణ్యం కల్గిన కంప్యూటర్ ప్రోగ్రామింగ్, ఫైనాన్షియల్ ఎనాలసిస్, ఎక్స్‌రే రీడింగ్ లాంటి ఐ.టి. ఉద్యోగాలు సైతం బయటకు తరలిపోతుండటంతో అమెరికా ప్రజల్లో ఆందోళన తీవ్రతరమైంది. ఇలాంటి పరిస్థితిలో ఔట్ సోర్సింగ్‌ను సాక్షాత్తు అధ్యక్ష ఆర్థిక సలహాదారు సమర్థించడంతో అమెరికా ప్రజల్లో తీవ్ర నిరసన వ్యక్తమయింది. నవంబరులో జరగబోయే అధ్యక్ష ఎన్నికల్లో అభ్యర్థిని ఎంపిక చేయడానికి ఇదే సమయంలో జరుగుతున్న ప్రైమరీల్లో ఇది ప్రధానాంశంగా తయారయింది.

డెమక్రటిక్ అభ్యర్థిత్వం కోసం అగ్రస్థానంలో ఉన్న జాన్‌కెర్రీ ఈ అవకాశాన్ని అందరికన్నా ఎక్కువగా ఉపయోగించుకున్నారు. "ఔట్ సోర్సింగ్ చేస్తున్న అమెరికా సంస్థలు దేశద్రోహానికి పాల్పడుతున్నాయి. అమెరికా ఉద్యోగాలను విదేశాలకు తరలిస్తున్న సంస్థల సి.ఇ.ఓలను బుష్ ప్రభుత్వం సత్కరిస్తున్నది" అంటూ ఆయన ప్రచారం చేశారు. అయితే ఔట్ సోర్సింగ్‌ను ఇంతగా వ్యతిరేకిస్తున్న కెర్రీ కుటుంబ యాజమాన్యంలో 79 వాణిజ్య సంస్థలుంటే వాటిలో 22 మాత్రమే అమెరికాలో ఉన్నాయి. మిగా 57 విదేశాల్లోనే పనిచేస్తున్నాయి. ఈ ప్రచారాలు, వాగ్వివాదాలు ఎలా ఉన్నప్పటికీ, ఔట్ సోర్సింగ్ అనేది సంపన్న దేశాలకు, వర్థమాన దేశాలకు మధ్య ఒక ప్రధాన సమస్యగా ముందుకొచ్చిన మాట మాత్రం వాస్తవం.

అసలీ 'ఔట్ సోర్సింగ్' అంటే ఏమిటి? అమెరికా, ఇతర సంపన్న దేశాలు తమ దేశాల్లో అక్కడి కార్మికులనే వినియోగించి నిర్వహించే పనులను, భారత్ లాంటి వర్థమాన దేశాల్లో వారికి అప్పగించి వారిచేత చేయించుకోవడం. వర్థమాన దేశాలతో పోల్చుకున్నప్పుడు సంపన్న దేశాల్లో కార్మికుల వేతనాలు అనేక రెట్లు అధికంగా ఉంటాయి. అవే పనులను వర్థమాన దేశాల కార్మికుల చేత చేయించుకుంటే ఉత్పత్తి ఖర్చులు బాగా తగ్గుతాయి. ఈ కారణం చేతనే సంపన్న దేశాల సంస్థలు 'ఔట్ సోర్సింగ్' చేస్తున్నాయి. మాన్యుఫాక్చరింగ్ రంగంతో సహా అన్ని రంగాలలో ఔట్ సోర్సింగ్ అమలు జరుగుతున్నప్పటికీ సర్వీసు రంగం, ముఖ్యంగా ఐ.టి., సేవలం రంగంలో ఇది అధికంగా కొనసాగుతున్నది. కమ్యూనికేషన్ టెక్నాలజీలో వచ్చిన విప్లవాత్మక మార్పుల వల్ల ఐ.టి.రంగంలో ఔట్ సోర్సింగ్ సులభతరం కావడమే దీనికి కారణం. ఐ.టి.రంగంలో పెద్ద సంఖ్యలో ప్రతిభావంతులైన నిపుణులు తయారవుతున్న భారత్‌లాంటి దేశాలలో 'ఔట్ సోర్సింగ్' మూలంగా గణనీయంగా ఉపాధి కల్పన జరుగుతున్నది.

అమెరికా ఆర్థిక వ్యవస్థ పురోగమనంలో ఉన్నప్పుడు విదేశీ కార్మికులను ఐ.టి. రంగం అక్కడికే తీసుకెళ్తూ ఉండేది. వారికి హెచ్-1బి వీసాలు మంజూరు చేయబడేవి. అక్కడికి వెళ్ళినప్పటికీ విదేశీ కార్మికులు ఆ దేశానికి చెందిన కార్మికుల కన్నా చాలా తక్కువ వేతనాలకే పనిచేసేవారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ మాంద్యాన్ని ఎదుర్కొంటున్న సమయంలో మరింత తక్కువ ఖర్చుతో పని చేయించుకునే పద్ధతులను ఆ దేశపు కంపెనీలు అన్వేషించసాగాయి. ఆ అన్వేషణ ఫలితంగానే ఔట్ సోర్సింగ్ ప్రాచుర్యం సంతరించుకున్నది. ఔట్ సోర్సింగ్‌తోపాటు 'ఆఫ్ షోరింగ్' కూడా రంగప్రవేశం చేసింది. 'ఆఫ్ షోరింగ్' అంటే సంపన్న దేశాల సంస్థలు తమ అనుబంధ సంస్థలను వర్థమాన దేశాలలో స్థాపించి వాటి ద్వారా పని చేయించుకోవడం.

వర్థమాన దేశాలలో. కారుచౌకగా లభించే కార్మికులను హెచ్-1బి వీసాల ద్వారా తమ దేశానికే రప్పించుకున్నప్పటికీ, లేదా 'ఔట్ సోర్సింగ్' ద్వారా, 'ఆఫ్ షోరింగ్' ద్వారా తమ కార్యకలాపాలను వర్థమాన దేశాలకే బదిలీ చేసినప్పటికీ సంపన్న దేశాల్లో ఆ మేర కార్మికులకు పనిలేకుండా పోతున్నది. అంటే నిరుద్యోగ సమస్య తీవ్రమవుతున్నది. అందువల్లనే ఈ అంశాలు ముఖ్యంగా 'ఔట్ సోర్సింగ్' రాబోయే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో

ప్రతిపక్షానికి పెద్ద ప్రచారాస్త్రంగా మారాయి.

ఇంతకుముందే అమెరికాలోని కనెక్టికట్, ఫ్లోరిడా, ఇండియానా, మేరీలాండ్, మిచిగన్, న్యూజెర్సీ, న్యూయార్క్, నార్త్ కొరిలినా లాంటి రాష్ట్రాలు ఔట్ సోర్సింగ్‌ను నిషేధిస్తూ చట్టాలు చేశాయి. మరికొన్ని రాష్ట్రాలు కూడా ఇదే బాటన నడుస్తున్నాయి. అమెరికా పార్లమెంటు కూడా ఔట్ సోర్సింగ్‌ను నిషేధిస్తూ చట్టం చేసింది. అయితే ఈ చట్టాలు ఆయా ప్రభుత్వాలకు చెందిన కార్యకాలాపాలను ఔట్ సోర్సింగ్ చేయరాదని మాత్రమే చెబుతున్నాయి. అంలే ఈ నిషేధం ప్రైవేటు సంస్థల కార్యకలాపాలకు వర్తించదు. ఔట్ సోర్సింగ్‌లో అమెరికా ప్రభుత్వం ద్వారా నేరుగా లభించేది స్వల్పం, ప్రైవేటు సంస్థల ద్వారా లభించేదే అత్యధికం. అందుచేతనే భారత దేశంలో ఔట్ సోర్సింగ్ ద్వారా ఆదాయం పొందుతున్న సంస్థలు ఈ చట్టాల వల్ల పరోక్ష ప్రభావం ఉంటుందేమో కాని ప్రత్యక్షంగా తమకొచ్చిన ముప్పేమీ లేదని ధీమాతో ఉన్నాయి. కాని ఎన్నికల ముంగిట ఉన్న రాజకీయవేత్తలు దేశంలో ఉద్యోగాలను సర్వశక్తులు ఒడ్డి రక్షిస్తున్నామని పోజు పెట్టడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అందువల్లనే ఔట్ సోర్సింగ్ చేసే ప్రైవేటు సంస్థలకు ఎలాంటి ప్రభుత్వ సహాయం అందించరాదని, రుణాలకు హామీదారుగా ఉండరాదని కోరుతూ తాజాగా అమెరికా ప్రతినిధుల సభలో యాభై మంది సభ్యులు బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిట్టు చట్టరూపం ధరిస్తే ప్రైవేటు సంస్థల ఔట్ సోర్సింగ్‌కు సైతం ముప్పు వాటిల్లుతుంది.

అమెరికాలో రాజకీయవేత్తలు గగ్గోలు పెడుతున్నంత పరిమాణంలో ఔట్ సోర్సింగ్‌వల్ల ఉద్యోగాలు హరించబడుతున్నాయా? భారత్‌లాంటి వర్ధమాన దేశాలకు ప్రచారం జరుగుతున్నంత పరిమాణంలో ప్రయోజనం లభిస్తున్నదా? అన్న అంశాలను కూడా పరిశీలించాల్సి ఉంది. ప్రస్తుతం భారతదేశంలో ఐ.టి., తత్సంబంధిత సంస్థలు నిర్వహించే ఔట్ సోర్సింగ్‌లో 3,28,250 మంది పనిచేస్తున్నారు. అమెరికా విధించిన నిషేధం ఫలితంగా వీరందరూ అదృశ్యమయ్యారని అనుకున్నా, ఇదే సంఖ్యలో అమెరికాలో కొత్త ఉద్యోగాలు సృష్టించబడ్డాయనుకున్నా అమెరికాలో నిరుద్యోగం ప్రస్తుతమున్న 73 లక్షల నుండి 70 లక్షలకు తగ్గుతుంది. నిజానికి అమెరికాలో నిరుద్యోగం పెరుగుతున్నది ఐ.టి. రంగంలో కాదు. ఉదాహరణకు 1993-2002 మధ్యకాలంలో అమెరికా వ్యవసాయ రంగంలో 33 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు. అట్లాగే మాన్యుఫాక్చరింగ్ రంగంలో కూడా పెద్దఎత్తున ఉద్యోగాలు అదృశ్యమయ్యాయి. ఇదే అంశాన్ని మరోవిధంగా కూడా చూడవచ్చు. ఫారెస్టర్ రీసెర్చ్ అనే సంస్థ 2000-2015 మధ్యకాలంలో అమెరికా నుండి ఔట్ సోర్సింగ్, ఆఫ షోరింగ్ ద్వారా 33 లక్షల ఉద్యోగాలు విదేశాలకు తరలిపోతాయని అంచనా వేసింది. అమెరికా శ్రామికశక్తి మొత్తం 1.38 కోట్లలో ఇది కేవలం 2.39 శాతం మాత్రమే.

భారతదేశం వైపు నుండి చూసుకున్నా ఔట్ సోర్సింగ్, ఆఫ్ షోరింగ్ కార్యకలాపాల్లో పాల్గొనే వారి సంఖ్య మహా అయితే 4 లక్షలుంటుంది. సరళీకృత విధానాల ఫలితంగా దేశం మొత్తం మీద ఒక వైపున ఉపాధి కల్పన భారీగా తగ్గిపోతుండగా, నిరుద్యోగ సమస్య తీవ్రమవుతున్నది. ప్రస్తుతం రిజిష్టరయిన నిరుద్యోగులే 4 కోట్ల మందికి పైగా ఉన్నారు. వీరితో పోల్చుకుంటే ఔట్ సోర్సింగ్ ద్వారా ఉపాధి లభించే 4 లక్షల మంది వారిలో కేవలం వందో వంతు మాత్రమే ఉంటారు. భారతదేశంలో కూడా కొద్దినెలల్లో ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ స్థితిలో ఇక్కడి పాలకులు సైతం ఔట్ సోర్సింగ్ విషయంలో అమెరికాతో తీవ్రంగా తలపడుతున్నట్లు పోజుపెట్టి ఓట్లు దండుకోవాలని ప్రయత్నిస్తున్నారు.

అమెరికా, భారత్‌లు అనుసరిస్తున్న ఈ రెండు ధోరణలు ఇటీవల అమెరికా వాణిజ్య మంత్రి జోలిక్ భారత్ పర్యటన సందర్భంగా వ్యక్తమయ్యాయి. ఒక వైపున ఔట్ సోర్సింగ్ లాంటి వాటిపై నిషేధాలు విధిస్తూ, భారత్‌లాంటి దేశాలను వాణిజ్య సరళీకరణ అనుసరించామని కోరడం సరికాదని వాణిజ్య మంత్రి అరుణ్ జైట్లీ ఆయనకు చెప్పారు. ఔట్ సోర్సింగ్‌పై నిషేధం ఎత్తివేయాలని అమెరికాను జైట్లీ గట్టిగా కోరారు. కానీ జోలిక్ మాత్రం భారత్ తన వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులపై అనేక ఆంక్షలను విధిస్తున్నదని వాటిని తొలగించాలని వత్తిడి చేశారు. తమ దేశంలో వ్యవసాయ రంగానికి పెద్ద ఎత్తున ఇస్తున్న సబ్సిడీల తొలగింపు విషయంపై మాత్రం పెదవి విప్పలేదు. ఔట్ సోర్సింగ్‌పై నిషేధం విషయాన్ని దాటవేశారు. అమెరికా అదరగండానికి, ద్వంద్వ నీతికి ఇది అద్దం పడుతున్నది.

ఏదేమైనప్పటికీ ఈ ఔట్‌సోర్సింగ్ వల్ల ఏదో మేర సంపన్న దేశాల ఉద్యోగాలకు ముప్పు ఏర్పడుతున్నది. అవి నిరుద్యోగ సమస్య మరింత తీవ్రంగా ఉండే వర్ధమాన దేశాలకు బదలాయించబడుతున్నాయి. దీనివల్ల సంపన్న దేశాల కార్మిక వర్గానికి, వర్ధమాన దేశాల కార్మికవర్గానికి మధ్య వైషమ్యాలు ఏర్పడుతున్నాయి. ఈ రకమైన సమస్యలను ప్రపంచ కార్మికోద్యమం, వివిధ దేశాల ట్రేడ్ యూనియన్లు పరస్పరం సంప్రతింపుల ద్వారా సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలని సి.ఐ.టి.యు. ప్రధాన

కార్యదర్శి ఎం.కే.పాంథేలాంటి వారు చెబుతున్నారు.

కాని ఈ విధంగా పరస్పర సంప్రతింపులు కాని, ఇంతకుముందు పేర్కొన్నట్లు ఔట్ సోర్సింగ్‌కు పాల్పడే ప్రైవేటు సంస్థలకు ప్రభుత్వ సహాయాన్ని ఉపసంహరించడం గాని - ఈ సమస్యకు మూలకారణాన్ని శాశ్వతంగా పరిష్కరించజాలవు. ఔట్‌సోర్సింగ్‌కు మూలం సంపన్న దేశాలు, వర్ధమాన దేశాల మధ్య ఉన్న తీవ్రమైన వేతన వ్యత్యాసాలలోనే ఉంది. ఈ వేతన వ్యత్యాసాలను తగ్గించడానకి చర్యలు చేపట్టినప్పుడే సమస్యకు అసలు పరిష్కారం లభిస్తుందని సంపన్న దేశాలలోని మేధావులతో సహా పలువురు చెబుతున్నారు. ఔట్‌సోర్సింగ్ ప్రమాదం తగ్గాలంటే కేవలం దేశం లోపల చర్యలు చేపడితేనే చాలదని అమెరికాకు చెందిన గ్లోబల్ ఎకానమి ప్రాజెక్టు డైరెక్టర్ సారా అండెర్సన్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ జాన్ కానవాగ్ ఇటీవల 'నేషన్' పత్రికకు రాసిన ఒక వ్యాసంలో పేర్కొన్నారు. సంపన్న దేశాలు రుణాల తగ్గింపు లాంటి చర్యల ద్వార నిరుపేద దేశాలకు వనరులు తరలించాలని, పలు రకాలుగా సహాయం అందించాలని, ఈ విధాంగా సంపన్న, వర్ధమాన దేశాల మధ్య వ్యత్యాసం తగ్గితే అది సంపన్న దేశాలకే ప్రయోజనకరమని వారు పేర్కొన్నారు.

అందువల్ల ఔట్‌సోర్సింగ్ సమస్యను పరిమిత దృష్టితోనే చూడకుండా విశాల అవగాహనతో అర్థం చేసుకోవాల్సి ఉంది. తాత్కాలికంగా సమస్యను సామరస్యంగా పరిష్కరించుకుంటూనే, విస్తృతమైన, దీర్ఘకాలిక ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకొని ముందుకు సాగితేనే అసలైన పరిష్కారం లభిస్తుంది. ○

(9వ పేజి తరువాయి)

గోదావరి ఎత్తి పోతల పథకం - అంచనాల్లో అస్పష్టత

సంవత్సరంలో 220 రోజులు, రోజుకు 9 గంటల చొప్పున పని చేయగలవు. ఒక్కో పంప్‌సెట్ ఆధ్వర్యంలో 5 ఎకరాలకు నీరు అందించగలుగుతాం.. ఈ ప్రత్యామ్నాయ విధానంలో యిదే సామర్థ్యం గల విద్యుత్ వినియోగంతో 40, 625 ఎకరాలను నీటి సౌలభ్యాన్ని కల్పించ గలుగుతామని మరో అంచనా.

50 టిఎంసిల నీటి సక్రమ వినియోగం ఐదు లక్షల ఎకరాలను సుభిక్షం చేయగలదు. ఈ నీటి పరిమాణాన్ని 250 మీటర్ల ఎత్తు ఉన్న ధర్మసాగరానికి పంపేందుకు 250 మెగావాట్ల సామర్థ్యంతో 1000 మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరం అవుతుంది. యిదే సామర్థ్యం గల విద్యుత్‌తో 1,35,400 ఫైవ్ హెచ్.పి. మోటార్లు పనిచేయగలవు. తద్వారా 6,77,000 ఎకరాల విస్తీర్ణం సుభిక్షం కాగలదు. 50 టిఎంసిల నీటి పరిమాణాన్ని 427 మీటర్ల ఎత్తున గల హన్సాపల్లి ట్యాంకుకు పంపేందుకు 410 మెగావాట్ల సామర్థ్యం లేదా 1650 మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరం అవుతుంది. యిదే విద్యుత్ సామర్థ్యంతో 22,34,253 ఫైవ్ హెచ్.పి. మోటార్ల ద్వారా 11,17,125 ఎకరాల విస్తీర్ణం మేరకు సాగునీరు అందించవచ్చును. ఈ తరహా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా లాభసాటి మార్గాన్ని వెదుక్కోవచ్చు. ఎత్తైన ప్రాంతానికి తక్కువ వ్యయంతో నీటిని అందించే అంశం యిందులో యిమిడివుంది కనుక.

మరో ప్రత్యామ్నాయంగా యోచించాల్సిన విషయం భూగర్భ జలలభ్యత. కాగా, 3 నుండి 34 టిఎంసిల జలవినియోగం ద్వారా కేవలం లక్షకు పైగా ఎకరాలకు సాగునీటిని అందివ్వగలమని ప్రభుత్వం యోచిస్తుంది. యిది కూడా బిందుసేద్య విధానం ద్వారా. అయితే ఈ బిందుసేద్య అమలుకు అదనపు వ్యయం అవసరం అవుతుంది. బిందుసేద్య పనిముట్లు, ఈ విధాన అమలుకు అదనపు విద్యుత్ వ్యయం, నీటి నియంత్రణ ప్రధానంగా అదనపు వ్యయాలు. ఒక ఎకరా విస్తీర్ణంలో బిందుసేద్యాన్ని అమలుచేసేందుకు 50వేల రూపాయలకు పైగా వ్యయం కాగలదని ఓ అంచనా. ఓ 50% రాయితీని ప్రభుత్వం వ్యయం అందించినా రైతాంగం 25వేల రూపాయల మేరకు వ్యయం చేయాల్సి ఉంటుంది. ఈ రాయితీ సైతం పరిమితం కనుక, పూర్తిగా గోదావరి ఎత్తిపోతల పథకం కిందికి వచ్చే యావత్తు ఆయకట్టుకు లభించే వెసులుబాటు లేనే లేదు.

ఈ పథకంలో నీటిని పంపేందుకు విద్యుత్ అవసరాన్ని గణించే క్రమంలో నీటిలభ్యతను 170 రోజుల్లోగా పేర్కొన్నారు. కానీ వేప్‌కో (WAPCO) ప్రాథమిక నివేదికతో నీటి లభ్యతను 120 రోజులుగానే పేర్కొంది.

విధాన అంచనాల్లో మరో ముఖ్యమైన లోపం ఏమిటంటే?

ఈ అంచనాల తయారీలో విద్యుత్ వినిమయ అంచాలను గణించేటపుడు పాత నీటిని పంపాల్సిన ఎత్తునే పరిగణనలోనికి తీసుకున్నారు. కానీ ఎంతదూరం మేరకు? అన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. ఈ దూరాన్ని సైతం పరిగణనలోనికి తీసుకొని ఉంటే విద్యుత్ వినియమం మరింతగా పెరుగుతుంది. ఈ కారణంగా పైన పేర్కొన్న అంచనాలు తప్పుడు/తక్కువ అంచనాల్లో సైతం ఎత్తిపోతల ద్వారా నీటిని బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు చేర్చేందుకు మాత్రమే తీసుకున్న గణాంకాలు. మరి వీటికి బిందుసేద్య అమలుకై అవసరమయ్యే విద్యుత్ వ్యయాన్నీ జోడించాల్సి ఉంటుంది.

యిదీ విద్యుత్ వ్యయ అంచనాల్లో యిమిడిఉన్న మకతిక....

యికపోతే, ఈ పథకానికి అవసరమయ్యే విద్యుత్ లభ్యత ఏ మేరకు? అన్న అంశాన్ని వచ్చే సంచికలో పరిశీలిద్దాం! ○

స్వేచ్ఛానువాదం: *విద్యాభూషణ్‌రావు*

బాబాలు - మీడియా

- జి.ఎస్.రామ్మోహన్

బాబాల గురించి ఇటీవల మీడియాలో విపరీతంగా స్టోరీలు వస్తున్నాయి. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ మీడియాలో. మూత్రం బాబాలు, నగ్న బాబాలు, కొబ్బరినూనె ఫాదర్లు, పార్లు బాబాలు... ఇంకా రకరకాల బాబాలు ప్రజల 'మూర్ఖత్వం'తో ఎలా ఆటలాడుకుంటున్నారో సవివరంగా చూపిస్తున్నారు. అంతటితో ఊరుకోకుండా బాబాల బండారం బయటపెట్టి తాము సామాజిక బాధ్యత నెరవేర్చుతున్నామని కూడా చెబుతున్నారు. సంతోషం. ప్రజల అంధ విశ్వాసాల మీద ఆటలాడుకునే ఎవరి బండారమైనా బట్టబయలు చేయవలసిందే. కాకపోతే ఇక్కడ రెండు ప్రశ్నలు తలెత్తకమానవు. ఈ అంధవిశ్వాసాలను తెరకెక్కించడంలో కొన్ని మాత్రమే ఎంపిక చేసుకుని చూపుతున్నారా, అన్ని అంధ విశ్వాసాలను తెరకెక్కించే ప్రయత్నం చేస్తున్నారా? అనేది మొదటిది. ఈ బాబాల దగ్గరికి జనం పరుగులు పెట్టడం వెనుక ఉన్నది కేవలం మూర్ఖత్వమేనా? మరేమీ లేదా? అనేది రెండవది.

హరోం హర అంటూ శివలింగం మీద పాలు, తేనె పోసి అర్చన చేస్తారు కదా! అపుడు ఛీఛీఛీ అని ముక్కు మూసుకుంటున్నామా? లేదుకదా! పైగా గొప్పగా ప్రచారం చేసారు కూడాను! లింగం చరిత్ర వీరికి తెలియదనుకోవాలా! తాపీ ధర్మారావు. వెనిగళ్ళ సుబ్బారావు వంటి హేతువాదుల రచనల దాకా పోనక్కర్లేదు. శివపురాణాన్నో, శ్రీనాధుడి పద్యాలనో చదువుకున్నా "శాస్త్రోక్తంగానే" ఆ లింగం ఏమిటో తెలుస్తుంది కదా! అది మూర్ఖత్వంగా కనిపించదా! దాన్ని విశ్వాసం అంటారు కదా ముందు అంధ చేర్చకుండా! ప్రజల విశ్వాసాలను గాయపరిచే హక్కులేదని కూడా అంటారు కదా! మరి విశ్వాసానికి - అంధ విశ్వాసానికి విభజన రేఖ ఎక్కడ గీయదల్చుకున్నారు ? సరే మరీ అంత అసాధ్యమైన విషయం ఎందుకులే గాని బాబాల దగ్గరికే వద్దాం. తమ ఆశ్రమంలోనే హత్యలు జరిగిన బాబాల జోలికి, గాల్లోంచి, ధూల్లోంచి రకరకాల వస్తువులను సృష్టించి భక్తులను "సమ్మోహనపరిచే" బాబాల జోలికి ఎందుకుపోరు? భయమా? లేక అలా సృష్టించడం హేతుబద్ధమనుకుంటున్నారా? అలాంటి చర్యలకు ఆకర్షితులై అక్కడికి వెళ్ళే భక్తులది అంధవిశ్వాసం కాదనుకుంటున్నారా? రకరకాల తాయెత్తులు, శ్రీచక్రాలు, మహిమగల ఉంగరాలు అంటూ ఊదరగొట్టే వారి జోలికెందుకెళ్ళరు. పైగా వాటి ప్రకటనలు అదే ఛానెళ్ళలో విపరీతంగా వస్తుంటాయి కదా! పోనీ వాణిజ్య, యాజమాన్య విధానాల పరిమితులు ఉంటాయనుకుందాం. మరి వాస్తు పేరుతో జరిగే కూల్చివేతల జోలికి ఎందుకు వెళ్ళరు? పైగా ప్రజాధనాన్ని వృధాచేస్తూ పాలకులు ఇష్టమొచ్చినట్టు కార్యాలయ భవనాల్లో కూల్చివేతలకు, మార్పులు చేర్పులకు పాల్పడుతుంటే "ఏమిటి ఈ మూర్ఖత్వం" అని ఎందుకు గట్టిగా నిలదీయరు? లేదంటే దాన్ని హేతుబద్ధమనుకుంటున్నారా. బలహీనులపై మాత్రం మన కలం రివ్వున లేస్తూ బలవంతులపై మౌనం దాలిస్తే అది మన బలహీనతను కూడా చాటుతుందని గుర్తించాలి.

ఇక్కడ అసలు విషయం అంధవిశ్వాసం కాదు. అది మధ్యతరగతికి ఆమోదనీయమైనదా, ఆమోదనీయం కానిదా అనే! మధ్యతరగతికి ఆమోదనీయమైన విశ్వాసాలను ఊరికే విశ్వాసాలు అని గౌరవనీయంగా వదిలేస్తాం. పైగా ప్రచారం కూడా కల్పిస్తాం. ఆమోదనీయం కాని వాటిని అంధవిశ్వాసాలు అని వెక్కిరిస్తాం. వెంటబడి తరుముతాం. సమాజంలో మధ్యతరగతీకరణ పెరిగే కొద్దీ అది విశ్వాసాల్లో కూడా కొంత లాజిక్‌ను వెతుక్కుంటుంది. "షిర్డీ సాయిబాబా అలా కాదండీ, ఆయన చాలా సేవ చేసిన మహనీయుడు" అంటుంది. నువ్వు కూడా ఎంతో సేవచేయొచ్చు కదా! ఆయన పేరుతో కోట్లాది రూపాయల పాలరాతి భవంతులు (ఆలయాలు) కట్టించడమెందులకు? (ఎందుకంటే అక్కడ మన ప్రశాంతతకు భంగం వాటిల్లకుండా వుండేందుకు, వర్గేతరులైన బీదా బిక్కి ధైర్యం చేసి అడుగు పెట్టకుండా వుండేందుకు) స్తోత్రాలు చదవడం, ఆయన తొండం తగిలించి శాయి గణేశ్ అని మతాంతీరీకరణకు సైతం పాల్పడే యావ ఎందులకు? అంతేకాదు, నిన్నటి దాకా చాలా మామూలు విషయాలైన పోలేరమ్మ, అంకాలమ్మ వంటి గ్రామ దేవతల జాతర్లు ఇవాళ అనాగరికమైనవిగా కన్పిస్తాయి. "మనస్సును ప్రకృతిలో విలీనం చేసి నువ్వు లేవు అనే స్థితిని సాధించడంలో పరమానందమయింది" అని ఏ విమానంలోంచో దిగిన ఒక ఖరీదైన గురువు (ఫైవ్‌స్టార్ గురువు) చెపితే నాగరికంగా

ఉంటుంది.అ దే ఏ పూజా కార్యక్రమంలో తప్పెట్ల మోతల నరాల బలహీనత వల్లో తదాత్మ్యం వల్లో కొందరికి "దేవతలు ఆవహించి" ఊగిపోతుంటే ఒట్టి జిమ్మిక్కుగా కనిపిస్తుంది. వెంకటేశ్వర్లు వెంకీగా మారే క్రమంలో ఇదంతా జరుగుతుంది. విశ్వాసం నాగరికమైన ముసుగు తొడుక్కుంటుంది. సహజంగానే చిన్నచిన్న బాబాల దగ్గరకు వెళ్ళే వారిలో గోచి గొంగడి వాళ్ళు ఎక్కువగా వుంటారు. పెద్ద పెద్ద ఆస్పత్రుల్లో అడుగుపెట్టలేని రోగులు ఎక్కువగా వుంటారు. కార్లలో వచ్చి బాబాలకు కవర్లలో ముడుపులు సమర్పించుకునేవారు, "లండన్‌లో మా వారు ఫ్లయిట్‌లో పడిపోయారు... చివరికి ఈ శ్రీచక్రం కొనుక్కున్న తర్వాత" అని అనుభవాలను చెప్పగలిగే వారు అంతగా వుండరు. సహజంగానే మన వర్గం నమ్మకాలు మనకు నమ్మకాలు గానూ, ఇతర వర్గాల నమ్మకాలు మూఢనమ్మకాలు గానూ కన్పిస్తాయి. ఇది మీడియాకు మాత్రమే పరిమితమై చెప్పడం లేదు. మన సహజ వైఖరి అది.

సరే రెండో విషయానికొద్దాం. భక్తి వెనుక ఉన్నది కేవలం విశ్వాసం మాత్రమే కాదు. ఆశ, భయం కూడా. దేవాలయం ముందు బైక్ స్లో చేసి చేతులను రెండుసార్లు చెంపలకు అటూ ఇటూ అనుకోవడం వల్ల కోల్పోయేదేమీ వుండదు. కానీ అలా అనుకోకపోవడం వల్ల ఏమైనా కోల్పోతామేమోనన్న భయం వుంటుంది. భక్తిలో, పూజల్లో మనం కోల్పోయేది తక్కువ. కానీ అవి చేయకపోవడం వల్ల మనం ఏం కోల్పోతామో, మనకు రావలసింది ఏది రాకుండా పోతుందోనన్న భయం అంతర్లీనంగా వుంటుంది. చాలా మందిని భక్తివైపు నడిపించేది ఇదే. ఒక నమస్కారం పడేస్తే పోయేదేముంది అనే భావన. మన కష్టనష్టాలకు మనం మాత్రమే బాధ్యులం కాదు. ఇంకెవరో పై నుండి నడిపిస్తున్నారు. వారని నమ్ముకుంటే అవి పరిష్కారమయ్యే అవకాశముంది అనే ఆశ. స్థాయీ బేధాలుంటే వుండవచ్చుగానీ స్వభావ రీత్యా బాలల భక్తి కూడా అంతే. అందరు చెప్తున్నారు కదా. మనమూ ఒక రాయేస్తే పోలా అనే భావన వుంటుంది. అది కూడా కాకుండా మనకొచ్చింది తీర్చుకోలేని కష్టమో, రోగమో అయినప్పుడు ఆ భారం ఇంకెవరిమీదో పడేస్తే ఒకలాంటి మనశ్శాంతి. పైగా చిన్న చిన్న బాబాల దగ్గరికి వెళ్ళే వారిలో ఎక్కువ మంది ఫైవ్‌స్టార్ ఆస్పత్రులకు వెళ్ళలేని వారే. ఎక్కువ మంది తీర్చగలిగిన రోగాలే ఎక్కువ వుంటాయి. పిల్లలు పుట్టకపోతే ఎందుకు పుట్టలేదు. ఎవరిలో లోవముంది అనే నిర్ధారించుకోవడానికి అవసరమైన పరిస్థితులు అందరికీ అందుబాటులో వున్నాయా? పోనీ భర్తలు అటువంటి పరీక్షల కోసం డాక్టర్ల దగ్గరకి వచ్చే సామాజిక పరిస్థితులు వున్నాయా? ఎంతమంది భర్తలు దాన్ని చిన్నతనంగా భావించకుండా డాక్టర్ల దగ్గరికి వస్తారు. 'మగతనం' అనేది ఒక బ్రహ్మపదార్థంగా మారిన తర్వాత ఆ భార్యలకు వేరే దిక్కేది. "గొడ్రాలి"గా ఇంటివారి నిందల నుంచి బయటపడడానికి మార్గమేదీ? అదిగో వారికి దివ్యౌషధంలా ఉపయోగపడతారు బాబాలు. అలాగే చాలా రోగాలు. ఏ గుండె రోగమో, కిడ్నీ రోగమో అయినప్పుడు ఊర్లో వుండే ఆచార్యుల వారో, మరో ఆర్.ఎమ్.పి. డాక్టరో అది మనవల్లయ్యేది కాదని చేతులెత్తేస్తారు. పట్నం డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళమంటారు. అక్కడికి వెళ్లేంత ధైర్యం వుండదు. అథవా వెళ్ళినా అక్కడ వాళ్ళు చెప్పిన ఫీజులు విని కళ్ళు తిరుగుతాయి. ఇంకో తరగతి వుంటుంది. వీరిలో కొందరు మధ్యతరగతి వారు కూడా వుంటారు. వీరికి వచ్చిన రోగాలకు అదేదో మణిరత్నం సినిమాల్లో మాత్రమే వినే విచిత్రమైన ఆంగ్లపేరు ఉంటుంది. అది నయం కాని వ్యవహారమని ఛాన్సెస్ ఫిఫ్టీ ఫిఫ్టీ అని డాక్టర్లు వారి పరిభాషలో చెబుతారు. ఇక వారు దొంగ దొంగగా ఇబ్బందిగా చిన్న చిన్న బాబాల దగ్గరకు సందేహాస్పదంగా వస్తారు. బాబాల గురించి రాసేటప్పుడు ప్రజారోగ్యాన్ని ప్రజలకు అందుబాటులో లేకుండా చేయడంపై గురించి కూడా దృష్టి పెట్టాలి. కేవలం రోగాలే కాదు. రకరకాల మనోక్లేశాలు. తగాదాలు వగైరా వున్న వారు కూడా క్యూకడుతుంటారు. తను అనుకున్నది జరిగితే తిరుమలలో కోటి రూపాయలు గుప్తంగా వదిలివేసే వారి మనస్తత్వం, వీరి మనస్తత్వం ఒకటే. తేడా రూపంలోనే, సారంలో కాదు. కాబట్టి ఇలాంటి వ్యవహారాల్లో అనేక అంశాలు మిళితమై వుంటాయి. ఊర్కే మూర్ఖత్వం అని ఒక్కముక్కలో కొట్టి వేయదగిన వ్యవహారం కాదిది. అయినప్పటికి పెద్దబాబాల గురించి, పెద్దదేవుళ్ళ గురించి రాయనంత మాత్రాన చిన్న చిన్న బాబాల గురించి రాయవద్దని చెప్పబోవడం లేదు. మీడియాలో మొత్తంగానూ, అందులో పని చేసే వారికిన్నూ వుండే పరిమితులు తెలుసు. ఇవాల్టి పోటీ ప్రపంచంలో సంచలనాత్మక వార్తా కథనాలకు వుండే ప్రాధాన్యం సామాజిక బాధ్యతగా వీటిని తెరకెక్కిస్తున్నామనే పెద్ద పెద్ద మాటల విషయంలో కాస్తంత సంయమనం పాటిద్దామని నా విజ్ఞప్తి. మనం కేవలం ఉద్యోగమాత్రులని గుర్తుంచుకుందామని వినతి.

○

“30 గంటల పాటు మూకాభినయం - సరికొత్త రికార్డు” వార్త

- తొమ్మిదేళ్ళ బాబు పాలనను ప్రజలు భరించడం అన్నిటికంటే పెద్ద రికార్డు.

“సరిలేరు మాకెవ్వరూ” వెంకయ్య నాయుడు

- ఎందుల్లో ? స్కాముల్లోనా !

“రైతుల్లో ‘ఫీల్‌గుడ్’ లేదు” అద్వానీ

- ఇప్పటికి ట్యూబులైటు వెలిగిందన్నమాట.

“తెలుగు అమలుకు తెగులు” పరుచూరి ఆవేదన

- భాషా సంఘం పుట్టినప్పటి నుంచి ఇదే తెగులు సామీ!

“ఎన్నాళ్ళీ శబ్దకాలుష్యం?” ఈనాడు పాఠకుడు

- ఎన్నికలపుడు ఈ ప్రశ్న వెయ్యాలటయ్యా? ఎన్నికల్లో బారాఖాన్ మాఫీ. అదంతే.

“అమెరికాలో ఔట్‌సోర్సింగ్ మీద దుమారం” వార్త

- అమెరికా చాలా వెనుకబడి వుంది. మన రాష్ట్రంలో ఒక ప్రాంతాన్నుంచి మరో ప్రాంతానికే ఔట్‌సోర్సింగ్ దుమారం. చంద్రబాబు ‘ఫస్ట్’ల లిస్టులో ఇదెపుడోచేరింది.

“పూలవానలో గాయపడ్డ జయ” వార్త

- ఎనిమిదేళ్ళ పాలనలో చంద్రబాబుకు ఇలాంటి అభిమానం ఎపుడైనా ఎదురైందా?

“2010 నాటికి చేనేత ఔళి రంగాల్లో 15 లక్షల మందికి ఉపాధి” ముఖ్యమంత్రి.

- ఆత్మహత్యలు చేసుకోకాకుండా, తిండిలేక చావకుండా ఉంటే చంద్రబాబే ముఖ్యమంత్రిగా వుంటే అపుడు చూద్దాం.

“భారత అణ్వస్త్ర పరీక్షలు 1998 మే 13న జరిగాయి. ఓట్ల లెక్కింపు మళ్లీ అదే రోజున జరుగుతోంది. రాబయే సంఘటనకు ఇదే శుభశూచకం” జశ్వంత్.

- అణుబాంబు పేలుతుంది. బిజెపి ఆశలు కూడా పేలిపోతాయి. ప్రజలకు ఇది శుభసూచకం కూడా కావచ్చు.

“టి.డి.పి. ఓడిపోతే రాష్ట్ర భవిష్యత్తుకే ప్రమాదం” చంద్రబాబు

- ఒక చిన్న సవరణ “టి.డి.పి. గెలిస్తే...”

“పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు” పరీక్షల డైరెక్టర్.

- రాజకీయ నాయకుల సభలకు, దేవుడి వూరేగింపులకు, వ్యక్తిగతంగా పాలకులకు, సినీమా స్టార్స్‌కు ప్రతీదానికీ పకడ్బందీ ఏర్పాట్లే !

“ఆరెస్సెస్ వత్తిళ్ళకు బిజెపి లొంగదు” చంద్రబాబు.

- బిజెపి ఏజెన్సీ చంద్రబాబు ఎపుడు పుచ్చుకున్నారు ?

మా మానిఫెస్టోలో సోనియా విదేశీయత” ఎర్రంనాయుడు.

- ఆరు నెలల సావాసం చేస్తే వాడువీడవుతాడట.

“పోలీసులకు టికెట్ ఇస్తే ఊరుకోం” సిఎంకు తమ్ముళ్ళ హెచ్చరిక.

- టికెట్ ఇవ్వకపోతే వాళ్లు ఊరుకోరే! అదీకాక సి.ఎం.కు ఎంత పాపులారిటీ వుందంటే, పోలీసులు లేందే అడుగు బయట పెట్టలేరు.

“స్టాంపుల కేసు నిండా పోలీసు ముద్రలే” వార్త.

- పోలీసుల ముద్రలు, రాజకీయ ముద్రలు ఒకటైపోతున్నాయి!

“మీడియాలు ఎవరినీ హీరోలను చేయవద్దు” కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు

- ఒక్క వాజ్‌పేయిను తప్ప.

“నక్సలైట్ వార్తలు రాస్తే చర్య తీసుకుంటాం” పోలీసు ఉన్నతాధికారి

- నక్సలైట్లకు ఇంత పెద్ద పబ్లిసిటీ తెచ్చిపెట్టిన చంద్రబాబుమీద కూడా చర్య తీసుకుంటారా?

ప్రపంచ బ్యాంకు నిధులు దుర్వినియోగమైనట్లు సర్వేలో తేలితే వాటిని తిరిగి చెల్లించవలసిన అవసరం లేదు. రుణం విడుదల చేసినపుడు ఆ నిధులు సక్రమంగా వినియోగించారో లేదో పర్యవేక్షించుకోవాల్సిన బాధ్యత కూడా ప్రపంచబ్యాంకుపై ఉంటుంది. దుర్వినియోగంలో బాబుకు ఎంత బాధ్యత ఉందో బ్యాంకుకు అంతే బాధ్యత ఉంది.

– డి. శ్రీనివాస్ (పి.సి.సి. అధ్యక్షుడు)

ఆనంద స్థాయిలను బేరేజు వేసే సర్వేను 65 దేశాల్లో నిర్వహించగా భారత్ 21 స్థానంలో నిలిచింది. అంతా బాగుందున్న భావన వల్ల భారత్ ప్రకాశిస్తున్న సంతోషం విషయానికి వస్తే ఏమంత వెలుగు పూలు పూయటం లేదు. అంతర్జాతీయ ఆనంద కొలమానంపై భారత్ చాలా క్రింది స్థాయిలో ఉంది.

– జితేందర్ నాగ్‌పాల్ (మనోవైజ్ఞానిక విశ్లేషకులు)

వచ్చే ఎన్నికల్లో గెలిస్తేనే మనం రాష్ట్రంలో ఉంటాం. ఇవి చారిత్రాత్మక ఎన్నికలు

– చంద్రబాబునాయుడు

తేదేపా ఆధ్వర్యంలో ర్యాలీ అంటే విద్వేషాలను రెచ్చగొట్టడమే

– కె. చంద్రశేఖరరావు

పార్లమెంటు రద్దు తర్వాత అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఎన్‌డిఎ ప్రభుత్వం దేశవ్యాప్తంగా కోట్లాది రూపాయలు వెదజల్లి చేసిన ప్రచార ప్రకటనలపై దర్యాప్తు జరిపించాలి.

– సీతారాం ఏచూరి(సిపిఎం పొలిట్ బ్యూరో)

స్త్రీలను ఒక వ్యాపార వస్తువుగా చూడడం వల్లే వారంటే చిన్నచూపు ఏర్పడింది. భారతదేశంలో మహిళా హింసకు వరకట్నమే ప్రధాన హేతువు. వరకట్న వేధింపులకు పాల్పడ్డవారిని దండించడానికి తగినన్ని చట్టాలున్నా అవేవి అమలుకు నోచుకోవడం లేదు.

– డోలోరస్ ఎ. డొనావిస్ (దక్షిణాసియా స్త్రీ-శిశు సమానత్వ సంస్థ కన్వీనర్)

2003 సంవత్సరం చివరి నాటికి అమెరికాకు గల అప్పులు 107 వేల కోట్ల 224 వేల కోట్ల డాలర్లకు చేరాయి. ఈ అప్పుల్లో చాలామటుకు విదేశాల్లోని రుణదాతలిచ్చినవే

– ఎలియన్ సినాయి (డెసిషన్ ఎకనామిక్స్ కన్సల్టింగ్ (అమెరికా) ప్రతినిధి)

వార్ నక్సలైట్ల ప్రకటనలకు పత్రికలు ప్రచురించకుండా చట్టపరంగా చర్య తీసుకుంటామని ప్రకటిస్తున్న డిజిపి ప్రకటనలు అప్రజాస్వామికం, పత్రికాస్వేచ్ఛను హరించడమే అవుతుంది.

– మాజీ డిజిపి వి.పి.బి. నాయర్

ప్రపంచీకరణ ప్రారంభమైన గత శబ్ది చివరి దశాబ్ధం నుండి నేటి వరకు రోజుకు కనీసం ఒక డాలర్ కూడా ఆదాయం లేని వారి సంఖ్య 10 కోట్లకు పెరిగింది.

– భైరాన్‌సింగ్ షెకావత్ (ఉపరాష్ట్రపతి)

కాంగ్రెస్, తెలంగాణ రాష్ట్ర సమితిల పొత్తు వ్యవహారాన్ని సామాన్యుదెవ్వరూ అభ్యంతరం చెప్పడం లేదు. తెలంగాణ ఆంధ్రప్రాంతాలు ప్రత్యేక రాష్ట్రాలుగా ఏర్పడాలన్న ప్రతిపాదనను ఆంధ్ర ప్రాంతంలో ఆహ్వానిస్తున్నారు.

– గుదిబండి వెంకటరెడ్డి (దుగ్గిరాల తాజామాజీ ఎమ్.ఎల్.ఏ.)

ముందు ముందు స్థూల దేశీయ ఉత్పత్తి ఏటా 8 శాతానికి మించి పెరుగుతుందని ప్రభుత్వం చేస్తున్న ప్రచారంలో పసలేదు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2004-05) జిడిపి వృద్ధి రేటు 6.4 శాతానికి మించదు.

– ఇక్రా (పరపతి క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ

పాదయాత్ర సృష్టించిన ప్రకంపనలు!

– వి.హనుమంతరావు

రాజశేఖర్‌రెడ్డి రెండు నెలల పాటు 1470 కిలోమీటర్లు పాదయాత్ర చేశాడు. కానీ రాజశేఖరుడు ఒంటరిగా నడవలేదు. బోలెడంతమంది ఆయనతో నడిచారు. ఆయనకోసం ఎదురు చూశారు. హారతులిచ్చారు. బొట్లు పెట్టారు. దీవించారు.

గత శతాబ్దం ముప్పయ్యవ దశకంలో శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుండి మద్రాసుకు సర్వశ్రీ కొమ్మారెడ్డి సత్యనారాయణ, చలసాని వాసుదేవరావు అధ్యక్ష, కార్యదర్శులుగా ప్రారంభమై జయప్రదంగా ముగిసిన రైతుయాత్ర (1937) రాష్ట్ర చరిత్రలో ఒక మైలురాయి అయితే, రాజశేఖరుడి పాదయాత్ర మరో మైలురాయి అని ఎవరైనా అభివర్ణిస్తే ఆ పోలిక సరికాదేమోనని అనిపిస్తుంది. అప్పటి పాదయాత్ర స్వతంత్ర పోరాటంలో భాగంగా సాగిన జైత్రయాత్ర. దాని రంగూ, రుచీ, వాసనే వేరు. ఈ పాదయాత్ర లక్ష్యాలు, ఉద్దేశాలూ వేరు. అదేమిటో తర్వాత విశ్లేషించుకోవచ్చు. కాని ఆ పాదయాత్రతో సరిపోల్చదలచుకొంటే ఆ యాత్ర ఇదేనని నిస్సందేహంగా చెప్పుకోవచ్చు. ఎన్.టి.ఆర్. పార్టీని స్థాపించిన సందర్భంలో చేసిన సుడిగాలి పర్యటనలో ప్రజాస్పందన అపూర్వమైనదని అప్పుడు అనుకొన్నామంటే, ఆ నాడు కాంగ్రెస్ పాలన అంటే విసుగెత్తిన ప్రజలు ప్రత్యామ్నాయం కోసం ఎదురు చూస్తున్న సందర్భంలో వెండితెర హీరో రాజకీయ ఆరంగేట్రం చేసేసరికి, కాంగ్రెస్ వ్యతిరేకత తెలుగుదేశం అనుకూలంగా మారి ఓట్ల పెట్టెలు నిండాయి. కాంగ్రెస్ వ్యతిరేకత మాత్రమే కాక, రెండు రూపాయల కిలో బియ్యం నినాదం కూడా ప్రజల నిర్ణయానికి పెద్ద ఎత్తున దోహదం చేసింది. రాజశేఖరుడి పాదయాత్ర సరిగ్గా అదే రాజకీయార్థిక నేపథ్యంలో జరిగింది. తెలుగుదేశం పాలనలో చంద్రబాబు అరిగిపోయిన గ్రామ్‌ఫోన్ రికార్డు ఉపన్యాసాలతో, తెచ్చిపెట్టిన అదనపు భారంతో ప్రజల ఓపిక, సహనం నశించిన నేపథ్యంలో ఈ పాదయాత్ర చేపట్టడంతో చరిత్ర పునరావృతమవుతుందా అని తమలో తామే చాలామంది ప్రశ్నించుకొంటున్నారు. ప్రజలు వారి గోడును చెప్పుకోవడానికి వినే నాథుడే లేని పరిస్థితిలో, వినే నాయకుడు వారి గుమ్మం దగ్గరకు, వారి గ్రామానికి వస్తున్నాడంటే, పాలోమని వచ్చారు. వారి గుండె బరువు దించుకున్నారు. ఆయనతో పాటు నడిచారు. ఇంత స్పందన ఉంటుందని బహుశా రాజశేఖరుడు కూడా ఊహించి ఉండడు. ముఖ్యమంత్రి కూడా ఏ ముఖ్యమంత్రి తిరగనన్ని గ్రామాలు తిరిగినట్లు చెప్పుకుంటున్నారు. కాని తేడా ఏమిటంటే ఆయన వినిపించడానికి తిరిగారు. ఈయన వినడానికి, తెలుసుకోవడానికి, కళ్ళారా చూడడానికి తిరిగారు. ప్రజల దృష్టిలో ఇది ముఖ్యమైన తేడా. వారి మనసుల్లో ఒక నిర్ణయానికి రావడానికి తోడ్పడే తేడా. అయితే ఈ ఉత్సాహం పోలింగ్ బూత్‌ల దాకా నడిపిస్తుందా అనేది మీరూ, నేనూ వేచి చూడాల్సిన పరిణామం.

పోలింగ్ బూత్ అంటే ఎన్నికలు గుర్తుకు వస్తాయి. కాంగ్రెస్ అధికారం కోసం తహతహలాడుతుందని రాజశేఖరుడు ముఖ్యమంత్రి కావడానికి ఈ పాదయాత్ర చేస్తున్నాడని స్వయానా ముఖ్యమంత్రి విమర్శ. రాజకీయాలలో వున్నవారు అధికారంలోకి రావాలనుకోవడంలో తప్పేమిటి? అందులోనూ రాజశేఖరుడి స్థాయిలో వున్న నాయకుడు ముఖ్యమంత్రి కావాలనుకోవడం తప్పా? ప్రతీ ప్రతిపక్షనాయకుడు ప్రత్యామ్నాయ ముఖ్యమంత్రి అని అంటారు. ప్రైమ్ మినిస్టర్ ఈజ్ వెయిటింగ్ అని బ్రిటిష్ పార్లమెంటులో అంటారు. ఆ మాటకొస్తే చంద్రబాబు రికార్డు ఏమిటి? స్వయానా మామతో ప్రయాణించి, లోతుపాతులు, బలహీనతలు, బలాలను అన్ని తెలుసుకొని ప్యాలెస్ కప్ చేసింది ముఖ్యమంత్రి పదవికోసమే కదా. జ్యోతిబసులా 25 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉంటానని అనలేదా? దేవేంద్రగౌడ్‌కు మనసులో ముఖ్యమంత్రి కావాలని లేదా? రాజశేఖరుడి ప్రజాప్రస్థానానికి ప్రజల్లో రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన స్పందనే కదా చంద్రబాబును కోటివరాలు ప్రకటించేలా చేసింది? అలా ప్రకటించింది ముఖ్యమంత్రిగా కొనసాగడానికే కదా? ఈయన కోటి వరాలు ప్రకటించి ముఖ్యమంత్రి కుర్చీని రిజర్వు చేసుకోవాలనుకుంటే, రాజశేఖరుడు ప్రజల వద్దకు వెళ్ళి, వారి ఆదరాభిమానాలను చూరగొని, ఎన్నికై, ముఖ్యమంత్రి కావాలనుకొంటే తప్పేమిటి? కిందస్థాయిలో వున్న ఉద్యోగి పై స్థాయికి

ఎదగాలనుకొంటాడు. పేదవాడు ధనవంతుడు కావాలని అనుకుంటాడు. అలాగే రాజకీయవేత్త కూడా. నేటి రాజకీయ వ్యవస్థలో ఇంత సహజమైన కోర్కెకు రాజకీయ ఉద్దేశాలు ఆపాదించడమే ఓ పెద్ద రాజకీయం.

అధికారంలో ఉంటేనే గాని ప్రజాసేవ చేయలేమనుకోడం అసలు తప్పు. ఆయన ముఖ్యమంత్రి కావాలనుకోవడం తప్పుకాదని, అసహజమేమీ కాదని అనుకున్నప్పుడు ఆ కల నిజమవ్వడానికి ముందు తెలుగుదేశాన్ని ఓడించాలి. ఆ ప్రయత్నంలో భాగంగా పాదయాత్ర చేశారు. ఆయన కంటున్నాడో, చంద్రబాబే కలలు కంటున్నాడో, ఆ విషయాన్ని తేల్చేది ప్రజలు. అయితే, రాజశేఖరుడి కల నిజమవ్వడానికి ప్రధానంగా రెండు అడ్డంకులు తొలగాలి. ఒకటి, ఆయన సొంత పార్టీలో ఆయన కాలు పట్టుకొని కిందకు లాగేవారి అడ్డంకి తొలగాలి, రెండు ఎన్నికల్లో అధికార పక్షం ఓడి ఆయన పార్టీ గెలవాలి.

ఈ ప్రజాప్రస్థానం మొదటి సమస్యను జనరల్‌గా పరిష్కరించింది. అయినా, ఇంకా ఆయన వ్యతిరేక శక్తులున్నాయంటే అదేమీ కొత్త విషయం కాదు. ఇలాంటి అంతర్గత వైరుధ్యాలు లేకపోతే అది కాంగ్రెసే కాదు. ఆ మాటకొస్తే అవి తెలుగుదేశంలో లేవా? అక్కడ అది నివురుగప్పిన నిప్పు. కాంగ్రెస్‌లో అది బహిరంగ రహస్యం. అంతే తేడా. రాజశేఖరుని పాదయాత్రకు వచ్చిన స్పందనే గీటురాయి అయితే, కాంగ్రెసే గెలుస్తుందని ఎవరైనా అంగీకరిస్తారు. ఈ ప్రజాప్రస్థానం తెలుగుదేశం పార్టీ నాయకుల గుండెల్లో రైళ్ళు పరుగెత్తించిందని అనడానికి కోటి వరాల ప్రకటనే తిరుగులేని నిదర్శనం. అయితే ఎన్నికల్లో పోటీలు, గెలవడాలు అంత సూటిగా వుండవు. రెండు పార్టీల మధ్య బిజెపి, తెలంగాణా రాష్ట్ర సమితి, వామపక్షాలు వున్నాయి. పార్టీల్లో గ్రూపులు, కులాలు, మతాలు స్థానిక కక్షలు, వీటన్నిటిమీద నుంచి లాంగ్‌జంప్ చేయాలి. అదీకాక, ఎన్నికలు జరగడానికి ఇంకా సంవత్సరంపైగా ఉంది. ఈలోగా రుతుపవనాలు కనికరిస్తే ఈ సంవత్సరంలోపే ఎన్నికలు ప్రకటించబోరని అనుకోవడానికి వీలు లేదు. ఈ రెండు ప్రత్యామ్నాయాలు దృష్టిలో ఉంచుకోకుండా రాజశేఖరుడు ఇంతమందుగా పాదయాత్రలో దిగి వుండరు. వెంటనే ఎన్నికలు వస్తే, ప్రజాప్రస్థానం ప్రభావం వుండి తీరుతుంది. లేదు, వచ్చే సంవత్సరంలోనే ఎన్నికలైతే, ఆ పరిణామాన్ని గమనంలో ఉంచుకోనంత అమాయకుడు రాజశేఖరుడు కాదు కదా. ఏమైనా, రాజశేఖరుడి ప్రజాప్రస్థానం ఆయన పార్టీకి వచ్చే మార్కుల శాతాన్ని పెంచింది. ప్రతిపక్ష నాయకుడిగా శాసనసభలో ఆయన పరిణతిని చూపిస్తున్నారు. ప్రజల సమస్యల గురించి ఇప్పటివరకూ మాట్లాడుతూ వచ్చారు. ఇప్పుడు కళ్ళారా ఆ సమస్యల విశ్వరూపాన్ని చూశారు. ఇది ఆయనలో ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాల పట్ల కాఠిన్యతను ఇనుమడిస్తుంది. పోటీ వాడి వేడి పెరుగుతుంది.

కాంగ్రెస్ గెలిస్తే రాజశేఖరుడి నెత్తిన పెట్టేది అధికార కిరీటం కాదు. రు.57 వేల కోట్ల రుణ కిరీటం. 1995లో దేశం అధికారంలోకి వచ్చినప్పుడు, కాంగ్రెస్ ఇనప్పెట్టె ఖాళీ చేసిందని దేశం విమర్శ చేసింది. ఇప్పుడు కొత్త ముఖ్యమంత్రి ఖాళీ ఇనప్పెట్టెతో పాటు ఓ ముళ్ళ కిరీటం కూడా అందుకోవాలి. ఈ పరిస్థితికి ప్రపంచ బ్యాంకు కారణం. మంగళసూత్రమైనా తెగిపోతుంది కాని ప్రపంచ బ్యాంకు బంధం తెగదు.

కొత్త ముఖ్యమంత్రి నీతో నేస్తం కటీఫ్ అన్నా, కేంద్రం వూరుకోదు. ఒప్పందం మీద సంతకం పెట్టింది కేంద్రం కాబట్టి. ఉచిత విద్యుత్ వాగ్దానాన్ని అమలు పరచాలి. ఉపసంహరించిన సబ్సిడీలను పునరుద్ధరిస్తే ఆయన రైతుల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకొంటారు. ఏడు సంవత్సరాలుగా అటకెక్కించిన నీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని రైతాంగం నిలదీస్తున్నది. ఏమైనా రాజశేఖరుడి ప్రజాప్రస్థానం రాష్ట్ర చరిత్ర పుటల్లో చోటు చేసుకొంటుంది. వై.ఎస్. పాదయాత్ర చంద్రబాబు ప్రభుత్వాన్ని పరుగులెత్తించింది. ఆయనే ఒక ఇంటర్వ్యూలో అన్నట్లు "ప్రజల సమస్యలకు పూర్తిగా అద్దం పట్టినట్లుగా, వాటిని మరింత దగ్గరగా చూసి అర్థం చేసుకొనేందుకు ఈ ప్రస్థానం వీలు కల్పించింది. చంద్రబాబు ప్రచార ఉపటాటోప పథకాలు గెలుస్తాయో ఓటమిని చవిచూస్తాయో ఎన్నికల వెండితెరపై చూడవలసిందే.

○

వీక్షణం చందాదారులు కాగోరువారు 'సమతా పబ్లికేషన్స్' పేర రూ.140/-లను డి.డి.గా కింది అడ్రసుకు పంపించగలరు.
వి.హనుమంతరావు, ఇం.నెం. 8-3-898/22, రోడ్ నెం. 3, నాగార్జుననగర్, హైదరాబాద్ - 500 073.

Owned, Printed and Published by **V.Hanumantha Rao** at D.No. 8-3-898/22, Road No. 3, Nagarjuna Nagar, Hyderabad-500 073. Ph: 23748672
Designed & Printed at: Nutan Art Printers, Lakdi-ka-pool, Hyderabad. **Editor**: V.Hanumantha Rao